Licensed to post without Prepayment No. J/Nellore/003/15-17 R.N.I.No.25359/74 - PLG/NL/9-10/03 నెల్లూరు, 30.10.2015, శుక్రవారం సంపుటి : 35 సంచిక : 22 పేజీలు : 12, వెల : ₹ 5


Dr. A.Swaroop Kumar Reddy, M.D.S.,
Professor - Department of Conservative Dentistry
Specialist - Cosmetic, Lasers & Implant Dentistry
ISO 9001-2008
CARE
SUPER SPECIALITY
DENTAL HOSPITAL
16-1/72, Pogathota, Nellore -524 001, (A.P.)
Ph: 0861-2303300, 6555555
Reimbursement Facility For State Government, APSPDCL & SHAR Employees

# లాయర్

వ్యవస్థాపకులు : తుంగా రాజగోపాలరెడ్డి సంగ్రాహకులు : తుంగా శివప్రభాత్‌రెడ్డి
www.lawyerteluguweekly.com

నిజంగా ప్రజల అవసరం కోసం ప్రజల ఆశయాల కోసం రాజధానిని నిర్మిస్తున్నారా..? లేక ఇదొక రియల్ ఎస్టేట్ వ్యాపారంలా ఆర్భాటంగా ప్రచారం చేసి ప్రపంచ స్థాయి వ్యాపార దిగ్గజాలను ఆకర్షిస్తున్నారా..? ఇది ప్రస్తుతం సర్వత్రా వినిపిస్తున్న చర్చ. ఒక బడా రియల్ ఎస్టేట్ సంస్థ బ్రోచర్‌ను లాంచ్ చేసినట్లుగా రాజధాని భూమిపూజకు అదిరిపోయే ఏర్పాట్లు చేసి వందల కోట్లు మట్టిపాలు చేశారు. ఇదంతా ఎవరి కోసం... ఎందుకోసం... ఎవరి స్వార్థం కోసం..? చంద్రబాబు అజమాయిషీలో, లోకేష్‌బాబు కనుసన్నల్లో నారాయణబాబు నడిపిస్తున్న ఈ రియల్ దందా వల్ల లాభం ఎవరికి...?

## రాబడి కోసమే రాజధాని

# ఆపరేషన్ అమరావతి

### లక్షల కోట్లే లక్ష్యం ... దోపిడీయే ధ్యేయం

రెండెకరాల ఆసామి రెండువేల కోట్లకు అధిపతి ఎలా అయ్యాడు...? ఇది 2004కి ముందు చంద్రబాబుపై ప్రతిపక్షాలు సంధించిన అస్త్రం. అవును నిజమే... కేవలం 9సంవత్సరాల పరిపాలనలో ముఖ్యమంత్రి స్థాయిలో రెండువేల కోట్లు ఎలా సంపాదించాడు..? అందరూ ఆలోచించారు... ప్రతిపక్షాల వాదనను ఆమోదించారు. ఆ ఎన్నికల్లో ప్రజలు కూడా బాబుకి గుడ్‌బై చెప్పారు.

### ప్రచార ఆర్భాటం కోసమే ప్రధాన మంత్రి

2004 నుండి 2009 వరకు డా॥ వై.యస్.రాజశేఖరరెడ్డి రాష్ట్రాన్ని పరిపాలించాడు. జనం నాడెరిగిన ముఖ్యమంత్రిగా జన శ్రేయస్సు కాంక్షించే నాయకుడిగా ప్రజల మెప్పు పొందాడు. అనుకోని ప్రమాదంలో అమరలోకాలకు తరలిపోయాడు. ఆయన మరణించిన వెంటనే ప్రతిపక్షాలన్నీ ఏకపక్షమై తెరపైకి తెచ్చిన క్రొత్త నినాదం జగన్ సంపాదన లక్షకోట్లు. అయ్య బాబోయ్.. లక్ష కోట్లు. ఇది సాధ్యమేనా! 9సంవత్సరాల పాలనలో కేవలం 2వేల కోట్ల స్థాయికి బాబు చేరితే, మరి ఐదేళ్ల తమ సామ్రాజ్యంలో లక్ష కోట్లు "జగన్ బాబు" వెనుకేసుకున్నాడంటే నమ్మశక్యమేనా..? (మిగతా 11వ పేజీలో)

• రొట్టెల పండుగ

## భక్త సాగరంలా... నగరం


11లో

• మన ఆదాయం మనకే...

## ఇప్పటికైనా మేల్కొన్నారు!

రాష్ట్ర విభజన సమయంలో హైదరాబాద్‌ను పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా ఉంచారు. అయితే హైదరాబాద్ ఆదాయంలో మాత్రం ఏపికి రూపాయి కూడా కేటాయించ లేదు. పదేళ్లు ఏపి రాజధానిని హైదరాబాద్‌లోనే ఉంచినంత మాత్రాన మనకు ఒరిగే దేమీ లేదు. ఇంకా ఒకరకంగా నష్టం తప్ప! ఈ పదేళ్లు మన రాష్ట్రానికొచ్చే ఆదాయాన్ని తెలంగాణకు ఇవ్వడం తప్ప! (మిగతా 11వ పేజీలో)



## ద్వితీయ వర్ధంతి

### కీ॥శే॥ శ్రీమతి వేమిరెడ్డి శ్యామలమ్మగారు

నిర్యాణం: 01-11-2013

అనురాగ మూర్తి... ఆత్మీయదీప్తి... **అమ్మ**
ఆమె ప్రేమాను రాగాలే మాకు స్ఫూర్తి
ఆమె నడిపించిన బాటే మాకు కీర్తి



కుమారుడు
**వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి**
గ్లోబల్ కాంట్రాక్టర్, నెల్లూరు.



# కాకుటూరు అనిల్‌కు బిజినెస్ లీడర్ అవార్డ్

నెల్లూరుజిల్లా బుచ్చి మండలం మినగలు వాసి, చెన్నైలో ప్రఖ్యాత పారిశ్రామికవేత్త, నీలాద్రి ప్యాకేజింగ్ ఇండస్ట్రీస్ మేనేజింగ్ డైరెక్టర్ కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి సౌత్‌ఇండియన్ బిజినెస్ ఛాంబర్ వారందించే బిజినెస్ లీడర్ అవార్డును అందుకున్నారు. ఇటీవల చెన్నైలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అఖిల భారత తెలుగు సమాఖ్య అధ్యక్షులు, నెల్లూరీయుడైన ప్రఖ్యాత వైద్యనిపుణులు డాక్టర్ సియంకె రెడ్డి చేతులమీదుగా ఆయన ఈ అవార్డును అందుకోవడం విశేషం. ఆయనతో పాటు వివిధ రంగాల నుండి పలువురు ఈ అవార్డులు అందుకోవడం జరిగింది. నీలాద్రి ప్యాకేజింగ్స్ అధినేతగానే కాకుండా దక్షిణభారత అట్టపెట్టెల తయారీదారుల సమాఖ్య అధ్యక్షులుగా కూడా అనిల్ చెన్నైలో అందరికీ సుపరిచితుడు. వ్యాపార రంగంలో చిత్తశుద్ధితో రాణిస్తూ ఇప్పటికే ఎన్నో పురస్కారాలను అందుకున్న అనిల్ ఖాతాలో తాజాగా ఈ అవార్డు చేరింది. అనిల్‌కు 'లాయర్' అభినందనలు.

# ఉత్తిదేనా... ఉపయోగముంటుందా?

**ముఖ్యమంత్రి జిల్లా పర్యటనకు వచ్చాడంటే జిల్లాపై దాని ప్రభావం కొంతన్నా ఉంటుంది. అన్నీకాకున్నా, కొన్ని సమస్యలకన్నా పరిష్కారం లభిస్తుంది. ప్రజలు కొంతలో కొంతన్నా సంతృప్తి చెందాలి.**





2014ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాలుగుసార్లు జిల్లాలో పర్యటించారు. అయితే జిల్లా అభివృద్ధికి సంబంధించి ఎటువంటి నిర్దిష్ట హామీలు కూడా ఆయన ఇవ్వలేదు. 2014 ఎన్నికల్లో ఈ జిల్లా నుండి తమ పార్టీకి సీట్లు తక్కువ వచ్చాయనే కోపం చంద్రబాబులో వుందని, దానివల్లే జిల్లా అభివృద్ధిపై ఆయన సీతకన్నేసారని అప్పట్లో ప్రచారం జరిగింది. అది నిజమేనని 'దేశం' నాయకులే అక్కడా ఇక్కడా చెబుతూ వచ్చారు. దీనికి తగ్గట్లే చంద్రబాబు విధానాలు వుంటూ వచ్చాయి. అభివృద్ధి పనుల విషయంలో ఆయన ఇంతవరకు జిల్లాకు ఎటువంటి ప్రాధాన్యత ఇవ్వలేదు. కేంద్రం మంజూరు చేసిన జాతీయ సంస్థల్లో ఒక్క దానిని కూడా నెల్లూరుజిల్లాకు ఇవ్వలేదు.

ఎన్నికలు జరిగి యేడాదిన్నరయ్యింది. జిల్లా మీద చంద్రబాబు కోపం కాస్తన్నా తగ్గివుండాలి. ఈ ఒకటిన్నర యేడాదిలో కల్లా నేటి 30వతేదీ ఆయన జిల్లా పర్యటన ఒకరకంగా జిల్లాలో అభివృద్ధికి దోహదం చేసేదేనని చెప్పొచ్చు. కండలేరు ఎడమ కాలువకు శంకుస్థాపన చేయడం శుభ పరిణామమే. ఎడమకాలువ ద్వారా పొదలకూరు, మనుబోలు, వెంకటాచలం మండలాల రైతాంగానికి ప్రయోజనం కలుగబోతోంది. దాదాపు 20వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించేలా ఈ లెఫ్ట్ కెనాల్‌ను నిర్మించనున్నారు.

పెన్నానది మీద సంగం, నెల్లూరు బ్యారేజీల నిర్మాణానికి దివంగత నేత వై.యస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే శంకుస్థాపనలు జరిగాయి. అయితే కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, అంచనావ్యయం పెరగడం వంటి కారణాలతో ఈ రెండో బ్యారేజీ పనులు ఏళ్ల తరబడి నత్తనడకన సాగుతున్నాయి. గత కొన్నేళ్లుగా పెన్నానదికి వరదలు లేవు కాబట్టి సరిపోయిందిగాని, లేకుంటే ఈ రెండో బ్యారేజీ వద్ద కట్టిన పిల్లర్స్ కూడా ఎప్పుడో కొట్టుకుపోయేవి.

ఇప్పుడు చంద్రబాబు పర్యటనతో ఈ రెండు బ్యారేజీ పనుల్లోనూ కదలిక వచ్చింది. ఈ రెండింటిని సత్వరం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ రెండు బ్యారేజీలు పూర్తయినా చంద్రబాబు జిల్లా పర్యటనకు ఫలితం దక్కినట్లే!




# మా వూరంటే నాకు చాలా ఇష్టం - జి.వి.కె.రెడ్డి

ఆ వూరి కోసం ఆయన ఎన్నో ఇచ్చాడు. ఇంకా ఇస్తూనే వున్నాడు. పేద వృద్ధ మహిళల కోసం వృద్ధపింఛన్లు ఇచ్చాడు, ఎంతోమంది చదువుల కోసం అండగా నిలిచాడు, తన గ్రామంలో బాగా చదివి పైకొచ్చిన వారికి ఉద్యోగాలిచ్చాడు. ఎన్నో సందర్భాల్లో వైద్యసేవలనందింపజేశాడు. చిన్మయా మిషన్ ద్వారా ఒక మహోన్నత విద్యాలయాన్ని నెలకొల్పి తన గ్రామ చుట్టుప్రక్కల వాళ్ళకు కూడా క్రమశిక్షణతో కూడిన నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందిస్తున్నాడు. జి.వి.కె.రెడ్డిగా ఆయన ప్రపంచమంతా తెలుసు. ఒక పెద్ద వ్యాపారవేత్తగా అనితరసాధ్య విజయాలను సాధించిన ఘనాపాటిగా 'పద్మభూషణ్' బిరుదాంకితుడిగా ఆయనని తెలియని భారతీయులు లేరు. కానీ వెంకట కృష్ణయ్యగా ఆ వూరి వారికి తెలుసు. అలా పిలుచుకుంటేనే వారికి ఇష్టం. అలా పిలిపించుకుంటే ఆయనకి ఇంకా ఇష్టం. తాను నెలకొల్పిన చిన్మయా విద్యాలయానికి తోడుగా ఇప్పుడొక వైద్యాలయాన్ని కూడా జి.వి.కె.రెడ్డి ప్రారంభించాడు.

## ● కుటుంబ వేడుకలా జరిగిన 'జివికె ఉచిత ఆరోగ్య కేంద్రం' ప్రారంభోత్సవం



అక్టోబర్ 29వ తేదీ గురువారం సాయంత్రం జరిగిన ఆ వైద్యాలయం ప్రారంభ వేడుకలో ఆయన భార్య, కుమారుడు, కోడలు, కుమార్తెలతో సహా తమ్ముళ్లు, చెల్లెళ్ళు, మరదళ్ళు అందరూ పాల్గొని గ్రామాన్ని కన్నుల పండువగా చేశారు.

సెయింట్‌జోసెఫ్ ఆసుపత్రి వారి సౌజన్యంతో నెలలో రెండుసార్లు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి కొత్తూరు పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్య బాగోగులు చూసే విధంగా ఈ జి.వి.కె. ఉచిత ఆరోగ్య కేంద్రాన్ని నెలకొల్పారు. ఇప్పటికే చిన్మయామిషన్ వారి జివికె చిన్మయా విద్యాలయంలోని చిన్నారుల ఆరోగ్య బాగోగులు చూస్తున్న కనికలాసుపత్రి వాళ్లు ఇప్పుడు ఈ బాధ్యతలను కూడా తీసుకోబోతున్నారు.

ప్రారంభోత్సవ వేదికపై మొత్తం కుటుంబ సభ్యులతో ఆశీనుడైన జి.వి.కె.రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ తన వూరన్నా, తన వూరి వాళ్ళన్నా తనకి ఎంతో ఇష్టమని, అందుకే తన వూరి కోసం తానెంత చేసినా తనకి తక్కువగానే వుంటుందని అన్నారు. వూరి ప్రజల పిల్లల బంగారు భవిష్యత్తు కోసం ఒక మంచి స్కూలును అందించానని, ఈ స్కూలులో 12వ తరగతి వరకూ అవసరమైన అన్ని వసతులను ముందుగానే ఏర్పాటు చేసేశానని అన్నారు. ఇక తన గ్రామ ప్రజలు ఆరోగ్యంగా వుండాలనే సంకల్పంతో ఇప్పుడా విద్యాలయానికి తోడుగా ఓ ఆరోగ్య కేంద్రాన్ని స్థాపిస్తున్నానని చెప్పారు. తన శక్తి మేరకు తన వూరికి సేవలు అందిస్తూనే వుంటానని, తన కుమారుడు సంజయ్ కూడా ఇదే ప్రేమని ఈ వూరిపై చూపిస్తాడని అన్నాడు.

తన వూరి కోసం తన వాళ్ళ కోసం తాను చేస్తున్న మంచి పనులను ప్రజలు సద్వినియోగం చేసుకుని తనకు సంతోషాన్నిస్తారని ఆశిస్తున్నానని అన్నారు. తన కుటుంబసభ్యులందరినీ పేరుపేరునా సభకు పరిచయం చేసి ఈరోజు అందరూ ఇక్కడకు చేరడం తనకు చాలా ఆనందంగా వుందన్నారు.

### నాన్న బాటలోనే నడుస్తా - సంజయ్

ఈ సందర్భంగా జివికె తనయుడు సంజయ్ మాట్లాడుతూ నాన్నకు బిడ్డలుగా తామంటే ఎంత ప్రేమో ఈ వూరన్నా వూరి ప్రజలన్నా అంతే ప్రేమని అన్నారు. ఈ వయసులో కూడా ఆయనతో పోటీపడి పనిచేయడం చాలా కష్టమని అన్నారు. ఈ వూర్లో ఇంకా మంచి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టి నాన్న ఆశయాలన్నీ నెరవేరుస్తానని హామీ ఇచ్చారు.

### మామ, భర్తల వెన్నంటే వుంటా - పింకీ రెడ్డి

సంజయ్ శ్రీమతి అపర్ణరెడ్డి(పింకి) మాట్లాడుతూ మా మామయ్య ఆశయ సాధనలో నా భర్తకు తోడుగా వుంటానని అన్నారు.

### కూతుర్నైనందుకు గర్విస్తున్నా - శాలిని భూపాల్

జి.వి.కె. కుమార్తె శాలిని భూపాల్ మాట్లాడుతూ జి.వి.కె. కూతుర్నైనందుకు గర్విస్తున్నానని, ఇలాంటి గొప్ప తండ్రికి కూతురుగా పుట్టడం తన అదృష్టమని అన్నారు.



### మీ ఆనందమే ఆయన విజయ రహస్యం - ఇందిరమ్మ

జి.వి.కె. సతీమణి ఇందిరమ్మ మాట్లాడుతూ ఆయన ఈ వూరుపైన ప్రేమతో ఎన్ని చేసినా ఆయన చేసిన పనులను మరింత ఆదరించి మంచి ఫలితాలనిస్తున్నందునే ఆయన ఇంకా ఎంతో చేయాలని తపన పడుతున్నారని, ఆయన మనోబలంకన్నా మీరంతా చూపిస్తున్న ఆదరణ, కనపరుస్తున్న ప్రేమ ఆయన చేసిన కార్యక్రమాల పట్ల చూపిస్తున్న శ్రద్ధ ఆయనకు కొండంత బలాన్ని ఇస్తున్నాయని జి.వి.కె. శ్రీమతి వూరి ప్రజలను ప్రశంసించారు.

సెయింట్ జోసెఫ్ ఆసుపత్రి నిర్వాహకురాలు సిస్టర్ బెటిలితో పాటు చిన్మయా మిషన్ నిర్వాహకులని, భవన నిర్మాణ బాధ్యతలు నిర్వహించిన ప్రసాద్‌రెడ్డిని తన బాల్యమిత్రుడు ఆదిశేషారెడ్డిని పేరుపేరునా అభినందించాడు జి.వి.కె.రెడ్డి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గ్రామప్రజలు పాల్గొన్నారు.

చివరిగా చిన్నా పెద్దా అన్న తేడా లేకుండా గ్రామంలో తనను అభిమానించే వారెవరైనా తనతో ఫోటో తీసుకోండని చెప్పి ఓపిగ్గా కొత్తూరు గ్రామ ప్రజలతో మమేకమై ఫోటోలను తీసుకున్న జి.వి.కె. సహృదయతను చూసి పొంగిపోవడం ఆ గ్రామస్తుల వంతయ్యింది. ఎదిగే కొద్దీ ఒదగమన్న... ఓ కవి మాటలకు అక్షరసాక్ష్యం జి.వి.కె.

దసరా రోజున ప్రారంభమైన

## డయాబెటిస్ అండ్ ఎండోక్రైన్ క్లినిక్



నెల్లూరులో సీనియర్ షుగర్ వ్యాధుల వైద్యనిపుణులు డాక్టర్ యస్.సత్యనారాయణ మూర్తి. ఎన్నో ఏళ్లుగా నెల్లూరుతో పాటు ప్రకాశం, కడప జిల్లాల నుండి వచ్చే షుగర్ వ్యాధిగ్రస్తులకు కూడా వైద్య సేవలందిస్తున్నారు. ఆయన అల్లుడు డాక్టర్ ఎం.వి.రామ్మోహన్ ఎండోక్రైన్ స్పెషలిస్టు. అపోలో వంటి ఆసుపత్రిలో పనిచేసి అనుభవం గడించారు. చెన్నై, హైదరాబాద్ వంటి నగరాలలో సొంతంగా ఆసుపత్రి పెట్టే అవకాశం వున్నా తన మామ బాటలోనే నడుస్తూ నెల్లూరీయులకు సేవలందించాలనే సత్సంకల్పంతో పొగతోటలోని డయాబెటిస్ సెంటర్‌లోనే ఎండోక్రైన్ క్లినిక్‌ను ఏర్పాటు చేశారు. మొన్న దసరా రోజున విశాఖపట్నంలోని ఆంధ్రా వైద్య కళాశాల ప్రొఫెసర్, రామ్మోహన్ గురువు కె.దిలీప్‌కుమార్ చేతులమీదుగా ఈ క్లినిక్‌ను ప్రారంభింపజేసారు. నెల్లూరీయుల సేవకు విచ్చేసిన రామ్మోహన్‌కు 'లాయర్' అభినందనలు.

## జయకు అస్వస్థత



దివంగత మాజీమంత్రి ఆనం వెంకటరెడ్డి మూడో కుమారుడు, తెలుగుదేశం నాయకులు ఆనం జయకుమార్‌రెడ్డి బుధవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. ఉదయం నెల్లూరు, సుజాతమ్మ కాలనీలోని తన ఇంటిలో వుండగా ఒక్కసారిగా పడిపోయి ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది పడసాగారు. వెంటనే ఆయనను బొల్లినేని ఆసుపత్రికి తరలించి, అత్యవసర విభాగంలో పెట్టి చికిత్సనందించారు. ఊపిరితిత్తుల్లో నెమ్ము బాగా చేరినట్లు గుర్తించిన వైద్యులు దానిని క్లియర్ చేసారు. ప్రస్తుతం ఆయన కోలుకుని బాగానే వున్నారు. ఐసియు నుండి గదికి కూడా మార్చారు. కుటుంబసభ్యులతో పాటు తెలుగుదేశం నాయకులు, అనుచరులు ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.




## 'ప్రభా'తం

# మానవతా 'గీత'ం



**దాదాపు 14 ఏళ్ల తర్వాత పాకిస్తాన్ నుంచి 'గీత' స్వదేశానికి తిరిగిరావడం ఒక అపురూపఘట్టం. ఇందులో భారత్ చొరవ, పాక్ సహకారం ఎనలేనివి. మనుషులంతా ఒకటేనన్న మానవీయత పల్లవించినప్పుడు, మనసులో ఆత్మీయత, స్నేహానుబంధాలు ఉప్పొంగినప్పుడు అశాంతికి ఇక చోటే వుండదు. ఆ మానవీయ..కరుణార్థ్రభావనలే విశ్వశాంతికి బాటలు వేస్తాయి. ప్రపంచ ప్రగతికి అవే రహదారులవుతాయి. గీతను తలచు కున్నవారందరికీ ఇప్పుడు అదే మానవీయతతో గుండెలు ఆర్ద్రమవుతున్నాయి.**

ఇది నిజంగా ఒక అద్భుతమే. మానవత్వం పల్లవించడమంటే ఇదే. మనిషిగుండెలో నిండుగా మానవతాభావం వుంటే ఇలాంటి అద్భుతాలకు కొదవుండదు. ఎందుకంటే, ఒక్కోసారి జీవితం..మనకు తెలియకుండానే అనుకోని మలుపులు తిరుగుతుంది. ఎక్కడెక్కడి దారులకో తీసుకువెళ్తుంది. కష్టాలు, నష్టాలు అన్నిటినీ చవిచూపిస్తుంది. అంతా అగమ్యగోచరంగా అనిపిస్తుంది. ఇక ఈ జీవితమింతేనా?..అని తీవ్ర నిరాశలో వున్నప్పుడు, ఇదిగో నేనున్నానంటూ విధి మళ్ళీ కరుణిస్తుంది. మానవత్వం పల్లవించాలేగానీ.. ఎన్ని కష్టాల గీతలనైనా అవలీలగా దాటేయవచ్చు. ఇప్పుడు సరిగ్గా 'గీత' విషయంలోనూ జరిగిందిదే. ఇదేదో సినిమా కథ కాదు. సినిమాల్లో ఇలాంటి కథలుండవచ్చేమో కానీ, నిజజీవితంలో ఇలా జరగడం మాత్రం నిజంగా ఒక అద్భుతమే అనిపిస్తోంది.

ఆమె పేరు..గీత. ఇప్పుడు యువతి అయినా అప్పట్లో ఆమె పదేళ్ళ బాలిక. ఢిల్లీ-లాహోర్ మధ్య ప్రయాణించే సంఝౌతా ఎక్స్‌ప్రెస్ రైలులో పాక్‌కు చేరిన భారత బాలిక ఆమె. పొరబడి ఆ రైలులో ఆమె పాక్‌కు చేరుకుంది. అందులోనూ ఆమె బధిర బాలిక. అక్కడి నుంచి ఆమె కథ అనేక మలుపులు తిరిగింది. ఇప్పుడామెకు ఇరవైమూడేళ్ళు. సుమారు పద్నాలుగేళ్ళపాటు పాక్‌లోని ఈధీ ఫౌండేషన్ అనే సంస్థ ఆమెకు ఆశ్రయమిచ్చింది. ఆ ఫౌండేషన్‌కు చెందిన బిల్క్వీస్ ఈధీ, ఆమె కుటుంబసభ్యులు గీతను సంరక్షించారు. ఇంతకాలం గీతను తమ సొంతబిడ్డలా చూసుకున్నారంటే అతిశయోక్తికాదు. ఇన్నేళ్ళ తర్వాత ఇది కలయా.. నిజమా అన్నట్లుగా భారత్ చొరవతో, పాక్ సహకారంతో గీత మళ్ళీ తన స్వదేశమైన భారత్‌కు తిరిగిరావడం గొప్ప విశేషం. అంతేకాదు, సాక్షాత్తూ భారత రాష్ట్రపతి, భారత ప్రధాని, విదేశాంగమంత్రి వంటి ప్రముఖులు ఆమెను సాదరంగా స్వాగతించడం ఒక అపూర్వ ఘట్టం. అంతటి మహనేతల స్వాగతం లభించడం గీత అదృష్టం. మూగ, చెవిటి బాలిక అయిన గీత ఇప్పుడు యువతిగా తిరిగి స్వదేశమైన భారత్‌కు చేరుకోవడం అందరూ ఆనందించదగ్గ విషయం. ఈ సందర్భంగా భారత విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ గీతను ఆహ్వానిస్తూ 'భారత పుత్రిక'కు స్వాగతం అంటూ శుభాకాంక్షలు తెలపడం, గీతను ఆప్యాయంగా ఆలింగనం చేసుకుని ఆహ్వానించడం అంతా భారత అపురూప సంస్కృతిలో భాగమే. భారత్‌కు తిరిగివచ్చిన గీతకు ప్రధాని నరేంద్రమోడీ స్వాగతం పలుకుతూ, ఇకనుంచి యావద్భారతం మీ బాగోగులు చూసుకుంటుందని భరోసా ఇవ్వడం ఎంత అద్భుతం!..ఇన్నేళ్లుగా గీతను ఆదరించి సొంత కుమార్తెలా చూసుకున్న ఈధీ ఫౌండేషన్ ప్రతినిధులకు ఈ సందర్భంగా ప్రధాని కృతజ్ఞతలు తెలపడం, ఆ సంస్థకు భారత ప్రభుత్వం తరపున కోటి రూపాయల విరాళం ప్రకటించడం భారతదేశ ఔన్నత్యానికి, కృతజ్ఞతాభావానికీ ఇంతకంటే నిదర్శనం ఇంకేమి కావాలి?.. కాగా, ఢిల్లీలో సుష్మాస్వరాజ్ సమక్షంలో జరిగిన విలేకరుల సమావేశంలో గీత మాట్లాడుతూ, "ఇన్నేళ్ళ తర్వాత భారత్‌కు తిరిగిరావడం చాలా సంతోషంగా వుంది.. నా మనసు ఎప్పుడూ భారత్‌లోనే వుంది".. అంటూ ఆమె సంజ్ఞల ద్వారా ఉద్వేగంగా చెప్పున్నప్పుడు అక్కడున్నవారంతా చలించిపోయారు. ఏదేమైనా, భారత పుత్రిక గీత పాక్ నుంచి తిరిగి భారత్‌కు చేరుకోవడాన్ని యావద్భారత దేశ ప్రజలు ఎంతగానో సంతోషిస్తున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ సంఘటన మానవత్వాన్ని మరింతగా పల్లవింపజేస్తోందనడంలో ఎట్టి సందేహమూ లేదు. అది భారత్ అయినా, పాక్ అయినా.. దేశమేదైనా సరే, మనిషి ఎక్కడున్నా మనిషే అనే తత్వంతో, మానవత్వంతో మనుగడ సాగిస్తేనే మానవ జీవితానికి సార్థకత. అశాంతికి, అరాచకత్వానికి ఆలవాలం కాకుండా, మనిషి మానవత్వంతో గుబాళిస్తే ఈ ప్రపంచంలో ఎక్కడ వున్నా మనిషి మనుగడకు ఎలాంటి ఇబ్బంది వుండదు. అయినా, ఆపదలో వున్నవారిని ఆదుకున్నప్పుడు, తప్పిపోయిన బిడ్డను తల్లి ఒడికి చేర్చినప్పుడు, పొరబాటున ఏ దేశానికో వెళ్ళిపోయి ఎన్నో ఏళ్ళ తర్వాత తిరిగి స్వదేశం చేరుకున్నప్పుడు, ప్రకృతి విపత్తులతో విలవిలలాడుతున్న బాధితులకు తామున్నామంటూ చేయూత అందించినప్పుడు..ఇలా అనేక సంఘటనల్లో బాధితుల కళ్ళల్లో మెరిసే ఆనందాన్ని చూడగలిగితే.. ఆ అనుభూతికి అవధులే వుండవు. అందుకే, పాకిస్తాన్-ఆఫ్ఘనిస్తాన్‌లు భూకంపాల్లో విలవిలలాడుతుంటే భారతప్రధాని నరేంద్రమోడీ బాధితులకు తక్షణసాయానికి సంకల్పించారు. మానవత్వానికి భారత్ ఎల్లవేళలా ఒక ప్రతీకగా నిలుస్తుందని ప్రధాని చెప్పకనే చెప్తున్నారు. అంతెందుకు, కాలేయవ్యాధితో బాధపడుతున్న ఐదేళ్ల పాక్ బాలిక ప్రాణాలు కాపాడేందుకు భారత్ మానవత్వంతో ముందుకు వచ్చి, ఆ పాప చెన్నై ఆసుపత్రిలో చికిత్స పొందేందుకు వీసా మంజూరు చేసింది. ఇలా ఒకరికొకరు ఇచ్చిపుచ్చుకునే ధోరణితో, మానవతాదృష్టితో వున్నప్పుడు కక్షలు-విభేదాల గీతలు వాటంతటవే చెరిగిపోతాయి. ఒకరి నుంచి మరొకరు ప్రేమపూరితమైన స్నేహవాత్సల్యంతో వున్నప్పుడు సమస్యలు వాటంతటవే తొలగిపోతాయి. మానవత్వపు మల్లెలు గుబాళించే చోట అశాంతికి తావుండదు. మనుషులంతా ఒకటేనన్న మానవీయత, ప్రేమైకభావనలు ఉప్పొంగినప్పుడు అశాంతికి ఇక చోటే వుండదు. ఆ మానవీయ.. కరుణార్ద్రభావనలే విశ్వశాంతికి బాటలు వేస్తాయి. ప్రపంచ ప్రగతికి అవే రహదారులవుతాయి. కక్షలు కార్పణ్యాలు, ఉగ్రవాదాలు, భీభత్సకాండలు, మారణ హోమాలు, అరాచకాలు దానవత్వానికి ప్రతిరూపాలే. అవి ఏ వ్యక్తికైనా, ఏ దేశానికైనా ఏనాటికీ మంచివి కావు. ఆయుధాలు, రక్షణవ్యయాలంటూ లక్షలకోట్లు వృధా చేసేకంటే, శాంతికీ-సహనానికి కట్టుబడి, ఒకరిపట్ల ఒకరు సోదరభావంతో స్నేహపూరితమైన ఆత్మీయ వాతావరణం వృద్ధిచేసుకుంటే అన్ని రకాల అశాంతులకూ ముగింపు పలికినట్లే. మనసులో వంకరగీతలు తుడిచేసుకుంటే చాలు మనకే కాదు..భావితరాలకూ భవ్యమైన మార్గం చూపినట్లే!...

# జ్ఞాననేత్రకు గీతాంజలి విరాళం



నెల్లూరుజిల్లా గూడూరులోని జ్ఞాననేత్ర అంధుల స్వచ్ఛంధ సేవా సంస్థకు గీతాంజలి కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, యాజమాన్యం మంగళవారం రూ.30,500లు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని కళాశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి మరియు కరస్పాండెంట్ యన్.సుధాకర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్ డా॥ జి.సుబ్బారావు సేవా సంస్థ ప్రతినిధులు శ్రీనివాస్, జ్యోతిలకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ కళాశాల విద్యార్థులు సామాజిక సేవా కార్యక్రమాల్లో ముందుంటారని, మానవతా దృక్పథంతో స్పందించి అంధులకు విరాళం అందజేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి పి.రాఘవరెడ్డి, ట్రిపుల్ ఇ విభాగానికి చెందిన రమణారెడ్డి, యన్‌యస్‌యస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పి.రంజిత్‌కృష్ణ, కళాశాల పిడి అశోక్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

# వర్షం కోసం యజ్ఞం

సకాలంలో వర్షాలు కురిసి జిల్లా పాడి పంటలతో కళకళలాడాలని, ప్రజలంతా సుభిక్షంగా వుండాలని కోరుకుంటూ నెల్లూరుజిల్లా, సంగం తిరుమనకొండపై వున్న శ్రీ రాజరాజేశ్వరిదేవి ఆలయంలో శ్రీ లలితా రుద్ర మహాయజ్ఞం నిర్వహిస్తు న్నారు. గత కొద్ది రోజులుగా ఇక్కడ ఈ మహాయజ్ఞం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా, ఆలయ పీఠాధిపతి శ్రీ రాజ రాజేశ్వరానంద మాట్లాడుతూ, లోక కల్యాణమే ఈ యజ్ఞం ధ్యేయమన్నారు. ఈ మహాయజ్ఞంలో భాగంగా తొలుత అమ్మవార్లకు కలశాభిషేకాలు చేశారు. ఆ తర్వాత కలశ పూజ, శ్రీచక్ర నవావరణ పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

# వీనుల విందుగా సుందరకాండ ప్రవచనాలు

కేతా అంకుల్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఇటీవల నెల్లూరు టౌన్‌హాలులో నిర్వహించిన సుందరకాండ ప్రవచనాలు వీనుల విందుగా సాగాయి. ప్రజల్లో భక్తిని పెంచి నీతిని బోధించే ఉద్దేశ్యంతో ట్రస్టు అధ్యక్షులు కేతా సుబ్బారావు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా బి.వి.నరసింహం, సర్వేపల్లి రామమూర్తి, ఇంజనీర్ శ్రీనివాసశర్మ తదితరులు పాల్గొన్నారు. ఆలూరు శిరోమణిశర్మ సుందరకాండపై దాదాపు రెండు గంటల పాటు ఉపన్యసించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. అనంతరం విచ్చేసిన వారందరికీ తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

## ర్యాగింగ్‌ను అరికట్టండి

ఈ సంస్థ ఆధ్వర్యంలో నవంబర్ 1వ తేదీ నెల్లూరు టౌన్‌హాల్లో సాయంత్రం 5గంటలకు 'ర్యాగింగ్‌ను అరికట్టండి' అనే అంశంపై సభ జరుగుతుందని ట్రస్టు అధ్యక్షులు కేతా సుబ్బారావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వొమ్మిన నాగసతీష్ బాబు, పెసల జగదీష్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఉదయం 10గంటల నుండి సాయంత్రం వరకు నృత్యాలు, ఏకపాత్రాభినయం పోటీలు జరుగుతాయన్నారు. 7గంటలకు శ్రీ బాలాజీ ఆర్కెస్ట్రా వారిచే పాట కచ్చేరి జరుగుతుందన్నారు. ఈ కార్యక్ర మానికి సింహపురి ప్రజలందరూ పాల్గొని జయప్రదం గావించాలని వారు కోరారు.




## పోలీసు విధుల్లో నిర్లక్ష్యం

ఎస్పీలు మారినప్పుడల్లా నెల్లూరు నగరంలో ట్రాఫిక్ రూల్స్ మారుతుంటాయి. ఒక్కో ఎస్పీ హయాంలో నెల్లూరు ట్రాఫిక్ ఒక్కో రకంగా వుంటోంది. కరుకుగా పనిచేసే ఆఫీసర్ వున్నప్పుడు పోలీసులు రోడ్ల మీద కనిపిస్తుంటారు. ట్రాఫిక్ సవ్యంగా వుంటోంది. నిదానంగా పని చేసే ఎస్పీలుంటే ట్రాఫిక్ పోలీసుల ఇష్టారాజ్యం అవుతోంది. ట్రాఫిక్ డ్యూటీలను సక్రమంగా చేయడం లేదు.

**బత్తుల పాండురంగారావు, నెల్లూరు.**

## అందరూ దొంగలే!

తామేదో ప్రతిప్రతలమన్నట్లు ప్రత్యేకహోదా కోసం కాంగ్రెస్‌పార్టీ వాళ్లు ఇప్పుడు ఇద్యమాలు చేస్తున్నారు. రాష్ట్ర విభజన చేసేటప్పుడు ఈ తెలివి ఏమైంది. కాంగ్రెస్ వాళ్లు అసలు విభజన బిల్లులోనే ప్రత్యేకహోదా అంశాన్ని చేర్చలేదే! రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా చేసింది కాంగ్రెస్‌పార్టీయే! ఈరోజు మొసలి కన్నీళ్లు కార్చినంత మాత్రాన రాష్ట్ర ప్రజలు ఆ పార్టీని క్షమించరు.

**ఎస్.గుణశేఖర్, నెల్లూరు.**

## వికలాంగుల అగచాట్లు

చాలామంది వికలాం గులు ప్రభుత్వం కల్పించే ప్రత్యేక సౌకర్యాలను పొందలేక పోతున్నారు. 40శాతంలోపు వైకల్యం కలవాళ్లు కూడా రాజ కీయ అండదండలతో సర్టి ఫికెట్లు పొంది పింఛన్లు, రిజర్వేషన్లు పొందుతున్నారు. అర్హులైన కొందరు వికలాంగులకు మాత్రం కనీసం పింఛన్‌లు కూడా రాకపోవడం దురదృష్టకరం. అసలుసిసలైన వికలాంగులకు పింఛన్‌ల సౌకర్యం కల్పించాలి.

**ఆలూరి ఆత్మానందం, నెల్లూరు.**

## ఇంత దుబారానా

ప్రపంచంలో ఏ దేశ రాజధాని శంకుస్థాపన కూడా అమరావతి అంత ఆర్భాటంగా జరిగి ఉండదు. రాష్ట్రంలో ఎన్నో నగరాలు, పట్టణా లున్నాయి. వాటిలో ఏదో ఒక దానిని రాజధానిగా చేసుంటే పోయేది. కాని కొత్త రాజధాని కట్టాలంటూ చంద్రబాబునాయుడు కేవలం శంకు స్థాపనకే వందల కోట్లు తగలేయడం సిగ్గు చేటు. ఇంత దుబారా చేసి రాజధానిని కట్టాల్సిన అవసరం వుందా?

**జి.సతీష్, ఆత్మకూరు.**

## సుప్రీం నిరంకుశత్వం

125కోట్ల మంది ప్రజలకు ప్రాతినిధ్యం వహించే పార్లమెంటు ముందు సుప్రీంకోర్టు చాలా చిన్నది. నిజమైన పౌరులంతా సమర్థించే 'ఆధార్'ను సుప్రీం వద్దనడం తగదు. కేంద్ర ప్రభుత్వ నిర్ణయంలో జోక్యం అనవసరం. 10మంది మేధావుల అభిప్రాయాన్ని మొత్తం దేశంపైనే రుద్దాలనుకోవడం సమంజసం కాదు. సుప్రీం కోర్టు పరిధులు దాటడం పద్ధతి కాదు.

**వాస్తు రామచంద్ర, నెల్లూరు.**

# కూలిన 'రియల్' ఆశల కోటలు

**ప్రభుత్వాలు అనుసరించే విధానాలను బట్టి వ్యాపారాలు, ఆర్థిక వ్యవహారాలు వేగంగా లేదా నిదానంగా జరుగుతుంటాయి. పాలకుల పని తీరును బట్టి ప్రజల్లో ఉత్సాహమైనా, నిరుత్సాహమైనా నెలకొంటుంది.**

ముఖ్యమంత్రిగా డాక్టర్ వై.యస్. రాజశేఖరరెడ్డి ఉన్నప్పుడు ఈ రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం కళ్లెం లేని గుర్రంలా పరుగులు తీసింది. ఆయన పని తీరు అంత వేగంగా, ఆయన విధానాలు అంత ఉత్సాహభరితంగా ప్రోత్సాహకరంగా ఉండినాయి. వై.యస్. మరణానంతరం రోశయ్య ముఖ్యమంత్రి అయ్యాడు. పనిలో వేగంతో పాటు పరిపాలనలో చురుకుదనం మందగించింది. కళ్లెంలేని గుర్రం లాంటి రియల్ ఎస్టేట్ కాస్తా కుంటి గుర్రమైంది. రోశయ్య తర్వాత కిరణ్‌కుమార్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాడు. అప్పటి దాకా కుంటుతూనున్న వున్న రియల్‌ఎస్టేట్ గుర్రం శుభ్రంగా ముసుగుతన్ని పడుకుంది. రాష్ట్ర విభజన జరిగింది. 2014లో ఎన్నికలు జరిగాయి. చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాడు. కొత్త రాజధానిని ప్రకటిస్తే రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం పుంజుకుంటుందని ఆశించారు. అమరావతి కేంద్రంగా రాజధాని ప్రకటించడం, భూసేకరణ ద్వారా భూములు తీసుకునే ప్రక్రియను మొదలుపెట్టడం, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో రియల్టర్లు కొనలేనంత భారీగా భూముల ధరలు పెరిగిపోవడంతో ఇక రియల్ ఎస్టేట్ వ్యాపారానికి లేచే పని లేకుండా పోయింది.



చంద్రబాబు ప్రభుత్వ విధానాలు రియల్ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేశాయి.

రియల్టర్లకు వున్న కంటితుడుపు ఆశల్లా అమరావతి రాజధాని సందర్భంగా ప్రధానమంత్రి ప్రత్యేకహోదా ప్రకటిస్తారని, తద్వారానైనా నెల్లూరుజిల్లాలో రియల్ ఎస్టేట్ పుంజుకోవచ్చని భావిస్తూ వచ్చారు. ప్రత్యేకహోదా వస్తే ముందుగా రియల్ ఎస్టేట్ పరుగులు తీసేది నెల్లూరుజిల్లాలోనే! పరిశ్రమలు ఎక్కువగా వచ్చేది ఇక్కడికే! కాబట్టి ప్రత్యేకహోదా కోసం నెల్లూరోళ్లే ఎక్కువగా ఎదురు చూసారు. ప్రధాని ఆ ఆశలపై నీళ్లు చల్లడంతో చివరి అవకాశం కూడా ఆవిరైపోయింది.

## బుచ్చయ్యకు జిల్లా దేశం బాధ్యతలు



తెలుగుదేశంపార్టీ నెల్లూరుజిల్లా ఇన్‌ఛార్జ్‌గా పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, చంద్రబాబు కన్నా సీనియర్ నాయకుడైన గోరంట్ల బుచ్చయ్యచౌదరిని నియమించారు. విజయవాడలో జరిగిన పార్టీ సమావేశంలో కేంద్ర ప్రధానకార్యదర్శి నారా లోకేష్ అన్ని జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌లను ప్రకటించారు. ఈ క్రమంలో తూర్పుగోదావరి జిల్లాకు చెందిన సీనియర్ అయిన బుచ్చయ్యకు నెల్లూరును అప్పగించారు.

## నగరంపై... ఆధిపత్యం కోసం...

***జిల్లాలోకల్లా తెలుగుదేశంపార్టీ బలహీనంగా వుండేది నెల్లూరు నగరంలోనే! ఏ జిల్లా ప్రధాన కేంద్రంలోనూ ఆ పార్టీ ఇంత చచ్చుగా లేదు. ఇది ఒక రకంగా చంద్రబాబు పుణ్యమే. పార్టీ ఇంత అవతారంగా వుంటే దీనికి ఇప్పుడు వర్గపోరాటాలు, ఆధిపత్య పోకడలు ఎక్కువయ్యాయి. నగరంపై పట్టు కోసం ఎవరి ప్రయత్నాల్లో వాళ్లుంటున్న నేపథ్యంలో విభేదాలు చోటు చేసుకుంటున్నాయి.***



నగరంపై పెత్తనం కోసం మేయర్‌గా అజీజ్ ఓ పక్క నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి ఇంకో పక్క నగర పార్టీ అధ్యక్షుడిగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి మరోపక్క... వీరికి మధ్యలో ఆదాల వర్గం కూడా పట్టు కోసం ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ మధ్య బారాషహీద్ దర్గా కమిటి విషయంలో ఆదాలకు, అజీజ్‌కు మధ్య విభేదాలు రావడం జరిగింది. దర్గా రూరల్ నియోజకవర్గ పరిధిలోకి వస్తుంది కాబట్టి, రూరల్ ఇన్‌ఛార్జ్‌నైన నేను చెప్పిన వాళ్లే దర్గా కమిటీ ఛైర్మెన్ కావాలని ఆదాల పట్టుబట్టడం, తన మనిషి ఆసిఫ్ బాషాకు ఆ పదవి ఇప్పించుకోవడం జరిగింది. మేయర్ అజీజ్ కూడా తన అనుచరులకు ఈ పదవి ఇప్పించుకోవడానికి తెగ ప్రయత్నాలు చేసాడు. నెల్లూరు కార్పొరేషన్ పరిధిలో దర్గా వుంది కాబట్టి నా మాటే చెల్లుబాటు కావాలని ఆయన ఆశ. కాని అది నెరవేరలేదనుకోండి.

ఇక నగరంలో రాజకీయంగా బలమైన పునాదులు వేసుకోవడానికి ఎవరి ప్రయత్నాల్లో వాళ్లు వున్నారు. వైకాపాలో వున్నప్పుడే మైనార్టీల కోటాలో అజీజ్ నెల్లూరు నగరం అసెంబ్లీ సీటు కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. ఇప్పుడు మేయర్‌గా ఒక పునాది దొరికింది. నగరంలో మైనార్టీ ఓట్లున్నాయి. నగరంలోని అన్ని ప్రాంతాల వారితో సంబంధాలు మెరుగుపరచుకుంటే రాబోయే ఎన్నికలనాటికైనా టిక్కెట్ రేసులో బలంగా వుండొచ్చనే తాపత్రయం అజీజ్‌ది.

ఇక ముంగమూరు శ్రీధరకృష్ణారెడ్డి నగరాన్ని అంత సులభంగా వదులుకుంటాడా? అధికార పార్టీ నగర ఇన్‌ఛార్జ్‌గా అధికార, అనధికార వ్యవహారాలలో ఎమ్మెల్యే కంటే ఎక్కువగా తల దూరుస్తున్నాడు. నగరాన్ని తన చేతుల్లో నుండి పోనివ్వకూడదనే ప్రయత్నం ఆయనది.

నగర పార్టీ అధ్యక్షుడుగా కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి 2014ఎన్నికలలోనే నగరం సీటు కోసం తీవ్రంగా ప్రయత్నించాడు. చంద్రబాబు ఇవ్వలేదు. పోరాడితే పోయేదేముంది అన్న తత్వం అతనిది. ఈమధ్య కాలంలో పార్టీ కార్యక్రమాలు ఎక్కువగా చేసేది అతనే, ఫ్లెక్సీ కటౌట్‌లు ఎక్కువగా పెట్టేది అతనే! నగరంలో పార్టీ పరంగా అందరికంటే ఎక్కువ సందడి శీనయ్యదే! అది కూడా నగరంపై పట్టుకోసమే!

ఇలా నగరంపై ఆధిపత్య పోరు నానాటికీ తీవ్రమవుతూ ఈ నాయకుల మధ్య అంతరం పెరుగుతుండడం విశేషం.

## చినుకు రాల్చని చిత్తకార్తె.. కునుకు రాని రైతన్న

- ఎండుతున్న పంటలు.. ఆవేదనలో అన్నదాతలు
- రైతుల బాధలు పట్టించుకోని ప్రభుత్వం

*చిత్తకార్తె అంటేనే వాన కార్తె. ఈ కార్తెలో వర్షాలకు కొదవుండేది కాదు. కానీ, ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. వరుణుడు కరుణించకపోవడంతో ఇది ఎండాకాలంగా మిడిమేళంగా తయారైంది. చిత్తకార్తెలో వర్షాలు జోరుగా కురుస్తాయని ఆశించి పంటలు వేసుకున్న రైతాంగానికి ఇది గద్దుకార్తెగా మారింది. పంటలు ఎండుముఖం పడుతుండడంతో రైతన్నల కన్నుల్లో కన్నీళ్ల మడుగులు కదుతున్నాయి. రైతులు ఇంతటి దీనావస్థలో వున్నా అటు ప్రభుత్వం కానీ, జిల్లా యంత్రాంగం కానీ పట్టించుకోకపోవడం దారుణం.*

**చిత్తకార్తె అంటేనే వాన కార్తె. ఈ కార్తెలో వర్షాలకు కొదవుండేది కాదు. కానీ, ఇప్పుడా పరిస్థితి మారిపోయింది. వరుణుడు కరుణించకపోవడంతో ఇది ఎండాకాలంగా మిడిమేళంగా తయారైంది.**

చిత్తకార్తెలో వర్షాలు జోరుగా కురుస్తాయని ఆశించి పంటలు వేసుకున్న రైతాంగానికి ఇది గద్దుకార్తెగా మారింది. పంటలు ఎండుముఖం పడుతుండడంతో రైతన్నల కన్నుల్లో కన్నీళ్లు మడుగులు కడుతున్నాయి. జిల్లాలో గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ ఏడాది అనేక మెట్టప్రాంతాల్లో వేసుకున్న మినుము, పెసర, కంది పంటల సాగు పరిస్థితి మరింత దయనీయంగా మారింది. వర్షాలు కురవకపోవడంతో ఈసారి మాగాణి పొలాల్లోనూ మినుము, పెసర సాగుకు సంకల్పించారు. వీటికి మంచి ధర వుండడంతో మెట్ట భూముల్లో సైతం ఇంతకాలం చేపట్టిన జామాయిల్ సాగును వదిలేసి మరికొంత మంది రైతులు మినుము, పెసరనే నమ్ముకున్నారు. జిల్లాలో సుమారు లక్ష ఎకరాల దాకా మినుము, మరో పాతికవేల ఎకరాల దాకా పెసర, ఇంకో పదివేల ఎకరాల దాకా కందిపంటను వేసుకున్నారు. అయితే, అదేమి దురదృష్టమో కానీ, వేసుకున్న నాటి నుంచి చుక్క వాన పడకపోవడంతో వేసుకున్న పంటలు వేసుకున్నట్లుగానే వాడిపోతుండడంతో రైతులు కన్నీళ్ళు పెట్టుకుంటున్నారు. భూగర్భజలాల నీటిమట్టం అడుగంటిపోవడంతో బోరుబావుల్ని నమ్ముకున్న రైతులు కూడా ఆ బావుల్లో నీరు లేకపోవడంతో దిగాలు పడిపోతున్నారు. ఈ చిత్తకార్తెలో వానలతో చెరువులు దొరువులు కాలువలన్నీ నిండిపోయేవి. కానీ, గత కొద్దికాలంగా జిల్లాలో సకాలంలో వర్షాలు పడకపోవడంతో అవన్నీ ఎండిపోయాయి. అనేక గ్రామాల్లో పంటపొలాలు సైతం బీడు భూములుగా మారిపోయాయి. దీంతో అందరికీ అన్నం పెట్టే అన్నదాతల దుస్థితి దయనీయంగా మారిపోయింది.

అనేక ప్రాంతాల్లోని పేద రైతుల కుటుంబాలు ఇప్పుడు జీవనోపాధికి కూడా నోచుకోలేక దుర్భరజీవితాలను అనుభవిస్తున్నారు. సూళ్ళూరుపేట, దొరవారిసత్రం తదితరప్రాంతాల్లో వేసుకున్న ఎల్లిపైర్లు ఎండి పోతుండడం అన్నదాతల బాధలు వర్ణనాతీతంగా వున్నాయి. ఇంతటి గడ్డుకాలం తామెప్పుడూ చూడలేదని రైతులు తీవ్రంగా ఆందోళన చెందుతున్నారు. ఈ మండలాల్లోని అనేకగ్రామాల్లో వరినార్లు వేసుకున్న రైతులు, పంటలు ఎదగక తమ కళ్ళముందే ఎండిపోతుంటే ఏమిచేయాలో తెలియక నిరాశలో పడిపోతున్నారు. ఇంకొద్ది రోజుల్లోనైనా వానలు కురవకపోతే నారుమళ్ళు ముదిరిపోయి ఎందుకూ పనికిరాకుండా పోతాయని వారు ఆవేదన చెందుతున్నారు. అప్పోసప్పో చేసి ఆరుగాలం కాయకష్టం చేసి పంటలు పండించే రైతన్నలు తమ పంటపొలాలు పండేందుకు తగ్గ నీటి వనరులు లేకపోవడంతో అనేక మండలాల్లో, ముఖ్యంగా మెట్ట ప్రాంతాలైన ఉదయగిరి, ఆత్మకూరు, సీతారామపురం, వింజమూరు, కలిగిరి, కలువాయి, చేజర్ల, పొదలకూరు, గూడూరు, వెంకటగిరి, నాయుడుపేట, పెళ్ళకూరు, చిల్లకూరు, చిట్టమూరు, ఓజిలి, తడ తదితర మండలాల్లో పరిస్థితి రోజురోజుకూ దయనీయంగా మారిపోతోంది. వానల కోసం రైతులు రాత్రింబవళ్ళు నిరీక్షిస్తూనే వున్నారు. పంటలు బాగా పండుతాయని, చేసుకున్న అప్పులు తీరుతాయని భావించి ఎంతో ఆశతో పంటలు వేసుకున్న రైతులు, చివరికి కుటుంబాలను పోషించుకోలేక దుర్భర పరిస్థితుల్లో జీవిస్తున్నారు. ముఖ్యంగా సన్నకారు, చిన్నకారు రైతుల పరిస్థితి మరింత అయోమయంలో పడిపోయింది. జిల్లాలో ఇలాంటి పరిస్థితులు తరచూ సంభవిస్తూనే వున్నా, అటు అధికార యంత్రాంగం కానీ, ఇటు ప్రభుత్వం కానీ రైతులకు సకాలంలో సాగునీరు అందించడంలో ఏమాత్రం శ్రద్ధ తీసుకోకపోతుండడంతో రైతన్నల ఆవేదన అంతా ఇంతా కాదు. ఈసారి వరిపంటను నమ్ముకున్న రైతులకు కంటనీరే మిగులుతోంది. చిట్టమూరు, గూడూరు తదితర మండలాల్లోనూ ఇదే దుస్థితి దాపురించింది. నీలి మబ్బులు కనిపిస్తాయే కానీ, నీటి చుక్కలు మాత్రం విదిల్చడం లేదు. దీంతో ఏరోజుకారోజు రైతులు ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారే తప్ప ఫలితం వుండడంలేదు. వానల్ని కురిపించు వాన దేవుడా అంటూ రైతులు ఆ వరుణుడి కరుణకోసం దీనంగా ప్రార్థిస్తున్నారు. కొన్ని గ్రామాల్లో గ్రామదేవతలకు పొంగళ్ళు పెడుతున్నారు. కప్పలకు పెళ్ళిళ్లు చేస్తున్నారు. యజ్ఞాలు యాగాలు చేసి వానదేవుడిని ప్రార్థిస్తున్నారు. అయినా, అదునుకు అవసరమైన వానలు మాత్రం కురవడం లేదు. ఈ కష్టకాలంలో జిల్లా ఉన్నతాధికారులైనా రైతులకు తగు చేయూతను అందించాల్సి వుంది.



# నెల్లూరు కబుర్లు

## సర్కార్ అంతా నెల్లూరులోనే!

ఈ నెల 30వ తేదీన రాష్ట్ర ప్రభుత్వమంతా కూడా నెల్లూరులోనే ఉన్నట్లనిపించింది. దసరా రోజు అమరావతిలో ప్రభుత్వ యంత్రాంగమంతా గుమికూడడం తెలిసిందే! వారం తిరక్కముందే 30వ తేదీ ప్రభుత్వ యంత్రాంగమంతా నెల్లూరులో వాలిపోయింది. దీనికి కారణం ఆరోజు నెల్లూరులో మంత్రి పి.నారాయణ కుమార్తె వివాహ వేడుకే! మరో మంత్రి గంటా శ్రీనివాసరావు కొడుక్కే ఈయన కూతురినిచ్చి పెళ్లి చేయడంతో నగరమంతా పెళ్లిసందడి చోటుచేసుకుంది. నారాయణ ఇంట పెళ్లంటే చంద్రబాబు ఇంట పెళ్లి జరిగినట్లే. ఇక ఇద్దరు మంత్రులు కూడా ముఖ్యులు కావడంతో ముఖ్యమంత్రి చంద్రబాబుతో పాటు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, వివిధ పార్టీల ప్రముఖులు, ఉన్నతాధికారుల రాకతో నెల్లూరులో తిరునాల లాగా అయ్యింది. వచ్చిన ప్రముఖులకు వసతి, బందోబస్తు ఏర్పాట్లు చేయడానికి జిల్లా అధికార యంత్రాంగం నానా తంటాలు పడాల్సి వచ్చింది.

## ఆరసలో నెల్లూరోళ్లకు చోటు




ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘంకు ఇటీవల విజయవాడలో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకోగా అందులో నెల్లూరు జిల్లా రచయితలు ఉండటం విశేషం. రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా సీనియర్ రచయిత్రి డాక్టర్ పెళ్లకూరు జయప్రదను, ప్రముఖకవి, ఆడిటర్ చిన్ని నారాయణరావును రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. మరో ఇద్దరు రచయితలు ఈతకోట సుబ్బారావు, పాతూరి అన్నపూర్ణలను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

## దుప్పట్ల పంపిణీ



నెల్లూరు బాలాజీనగర్ శివారు ప్రాంతం పద్మావతి నగర్‌లోని సాయి దర్బార్ అద్దాల మందిర యువ సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందిర మేనేజింగ్ ట్రస్టీ మధుసాయి మాట్లాడుతూ సాయిబాబా 97వ ఆరాధన మహోత్సవాలను పురస్కరించుకుని నెల్లూరులో ఎలాంటి ఆదరణ లేని వృద్ధులు, వికలాంగులకు వంద దుప్పట్లను పంపిణీ చేసినట్లు తెలిపారు.

## 'ప్రత్యేక హోదా' రొట్టె




నెల్లూరులోని బారాషాహీద్ దర్గాలో ఎంతో భక్తిశ్రద్ధలతో జరుగుతున్న రొట్టెల పండుగలో భాగంగా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా కావాలని కోరు కుంటూ యూత్ కాంగ్రెస్ నాయకులు సోమవారం రొట్టెను స్వీకరించి మొక్కుకున్నారు. తెలంగాణ నుంచి వచ్చిన మహిళల వద్ద ఆ మేరకు రొట్టె స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యూత్‌కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేతంరెడ్డి వినోద్‌రెడ్డి, నాయకులు ఉడాలి సూర్య నారాయణ, కస్తూరయ్య, రాజ్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, అజీజ్ తదితరులు పాల్గొన్నారు.

## పముజులకు తప్పిన ముప్పు!



సిపిఐ సీనియర్ నాయకులు పముజుల దశరథరామయ్య మంగళవారం హత్యాయత్నం నుండి బయటపడ్డారు. ఆయన స్వగ్రామమైన నెల్లూరురూరల్ మండలం సౌత్‌మోపూరులో డ్రైనేజీ కాలువ పనులు జరుగుతున్నాయి. రోడ్డు పక్కనే సైడ్‌కాలువను నిర్మిస్తుండగా బట్టేపాటి ప్రతాప్ అనే వ్యక్తి తన ఇంటి ముందు కాలువ తవ్వొద్దంటూ అడ్డుకున్నాడు. పాతకాలువ స్థానంలోనే కదా కొత్త కాలువ కట్టేది, అభ్యంతరమెందుకంటూ దశయ్య నిలదీశారు. దీంతో ఆగ్రహించిన ప్రతాప్ ఇంట్లో కెళ్లి గడ్డపార తెచ్చి దశయ్య గుండెల మీద పొడవబోయాడు. ఆయన చేతులు అడ్డుపెట్టి తప్పించుకున్నాడు. చేతికి బలమైన గాయమైంది. స్థానికులు ప్రతాప్‌ను పట్టుకుని కసితీరా కొట్టారు. దశయ్యను వెంటనే నెల్లూరులోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స చేసారు. పోలీసులు నిందితుడిపై కేసు నమోదు చేసారు.

## రక్తదానంపై అపోహలు తొలగించాలి



ఆరోగ్యంపై గ్రామీణులకు అవగాహన కల్పించి, రక్తదానంపై అపోహలను తొల గించాలని నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి సూచించారు.

ఆదివారం నెల్లూరుజిల్లా కొండ్ల పూడిలో స్వాన్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వ హించిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో యువత ముందుండాలని కోరారు. యువకులు బృందాలుగా ఏర్పడి గ్రామాల్లో నెలకొన్న ఆరోగ్య సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ శిబిరంలో దాదాపు 40మంది రక్తదానం చేశారు. గ్రామ సర్పంచ్ శారదమ్మ, ఎంపిటిసి సునీల్, వైయస్సార్సీపీ రూరల్ మండల కన్వీనర్ వేమిరెడ్డి హరిశివారెడ్డి, శ్రీనివాస యాదవ్, అధ్యక్షుడు భానుతేజ తదితరులు పాల్గొన్నారు.

## బెంగుళూరు టు అమరావతి

### కర్నాటక తెలుగు యువత సైకిల్ యాత్ర



తెలుగుదేశం పార్టీ కర్నాటక కో-ఆర్డినేటర్ రావి మోహన్ చౌదరి ఆధ్వర్యంలో బెంగుళూరులోని తెలుగు యువత కార్యకర్తలు సైకిళ్ల మీద 700కిలోమీటర్లు ప్రయాణించి చిత్తూరు, తిరుపతి, నెల్లూరుల మీదుగా ఈ నెల 21న అమరావతికి చేరుకున్నారు. ఈ నెల 17న బెంగుళూరులో చిత్తూరు ఎమ్మెల్యే శ్రీమతి సత్యప్రభ, రావి మోహన్‌చౌదరిలు జెండా వూపి యాత్రను ప్రారంభించగా, 21వ తేదీన గుంటూరులోని టీడీపీ కార్యాలయం వద్ద శాసనసభ స్పీకర్ కోడెల శివప్రసాద్‌రావు, ఎంపి గల్లా జయదేవ్, వినుకొండ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు ఈ సైకిల్ యాత్రకు స్వాగతం పలికారు.

**రావి ఇటుకల విరాళం:** అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రభుత్వం ప్రారంభించిన 'నా ఇటుక - నా అమరావతి' కార్యక్రమానికి రావి మోహన్‌చౌదరి 60వేలు పెట్టి 6వేల ఇటుకలను ఆన్‌లైన్ ద్వారా కొనుగోలు చేసారు. రాజధాని నిర్మాణ సంకల్పంలో తానూ భాగస్వామి అయ్యారు.

## శివయ్య హుండీ లెక్కింపు

నెల్లూరు మూలాపేటలోని శ్రీ మూల స్థానేశ్వరస్వామి దేవాలయం హుండీలను మంగళవారం లెక్కించారు. జూలై 4వ తేదీ నుండి అక్టోబర్ 27వ తేదీ వరకు హుండీల ద్వారా 5,47,197 రూపాయల ఆదాయం లభించింది. ఈ లెక్కింపు కార్యక్రమంలో ఇ.ఓ కోవూరు జనార్ధన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఇన్స్‌పెక్టర్ శైలేంద్ర, ధర్మకర్తల మండలి మాజీసభ్యులు కూడా పాల్గొన్నారు.

## ఏజంట్లపై నిషేధం

నెల్లూరులోని జిల్లా రవాణాశాఖ కార్యాలయంలోకి అసలు ఏజంట్లనే రానీయడం లేదు. సోమవారం తన ఛాంబర్ వద్ద వున్న ఒక ఆర్టీవ ఏజంట్‌ను చూసి ఆర్టీఓ పూర్ణచంద్రరావు అగ్గిమీద గుగ్గిలమయ్యారు. వీళ్లను లోపలకు ఎవరు పంపించారంటూ మండిపడ్డారు. ఏజంట్లు ఇచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యత ఇస్తే చర్యలు తప్పవంటూ సిబ్బందిని కూడా హెచ్చరించారు. కళ్లు గప్పి లోపలకు వస్తే క్రిమినల్ కేసులు పెడతామంటూ ఏజంట్లకు వార్నింగ్ ఇచ్చారు.

## భక్తులకు అన్నదానం

రొట్టెల పండుగకు నెల్లూరులోని బారా షాహీద్ దర్గా వద్దకు విచ్చేసిన భక్తుల సౌక ర్యార్థం నగరంలోని కెవిఆర్ పెట్రోల్‌బంక్ కూడలిలోని అచ్యుత సుబ్రహ్మణ్యం కల్యాణ వేదిక ఆధ్వర్యంలో సుమారు ఆరువేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో అచ్యుత సుబ్రహ్మణ్యంతో పాటు స్థానిక ప్రముఖులు ఆకుల వెంక టేశ్వర్లు, దశరథరామిరెడ్డి, నారాయణరెడ్డి, భాస్కరరావు, అచ్యుత శివమణికంఠ, మధుసూదన్‌రావు, బద్రి నారాయణ తది తరులు పాల్గొన్నారు.

## పోలీసు సిబ్బంది పనితీరు భేష్

### - జిల్లా ఎస్పీ గజరావు భూపాల్



రొట్టెల పండుగ బందోబస్తులో విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బంది పని తీరు ప్రశంసనీయమని జిల్లా ఎస్పీ గజరావు భూపాల్ స్పష్టం చేశారు. రొట్టెల పండు గలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సిబ్బంది పక్కా ప్రణాళికతో విధులు నిర్వహించారన్నారు. రొట్టెల పండుగలో ప్రధానమైన గంథోత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించిన సిబ్బందిని ఎస్పీ అభినందించారు. ఏఎస్పీ రెడ్డి గంగాధర్, నగర, రూరల్, ఎస్‌బి డిఎస్పీలు ఎస్.ముగ్బుల్, తిరుమలేశ్వర్‌రెడ్డి, కోటారెడ్డి, నగర ఇన్‌స్పెక్టర్లు కె.నరశింహారావు, సుధాకర్‌రెడ్డి, రామారావు, సీతారామయ్య, సుబ్బారావు, బాజీజాన్ సైదా, ట్రాఫిక్ డిఎస్పీ మైలా జనార్థన్, సిఐ మాధవరావు, ఇతర జిల్లాల నుంచి వచ్చిన పోలీసు అధికారులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## గీతామయిలో వృద్ధులకు అన్నదానం



నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నెల్లూరు బాలాజీనగర్‌లో వున్న గీతామయి వృద్ధుల ఆశ్రమంలో నారా లోకేష్ సేవాసమితి ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ వృద్ధులకు వస్త్రదానం, అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వృద్ధుల సమక్షంలో కేక్ కట్ చేసి పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఉపాధ్యక్షులు పాముల రమణయ్య, పాశం శ్రీనివాసులు, హరి, వెంకటేష్, ఆశ్రమ నిర్వాహకులు తమ్మినేని పాండు పాల్గొన్నారు.

## హమ్మయ్యా... చల్లబడింది

స్వాతి కార్తె వచ్చింది... నిన్నటి దాకా ఎండలు మే నెలలో కాసినట్లే కాసాయి. ఇప్పుడు వాతావరణం కొంత చల్లబడింది. ఆకాశం మేఘావృతం కావడం, చిరుజల్లులు కురవడం చూస్తుంటే వర్షాల మీద ఆశలు మొలకెత్తుతున్నాయి.

# పరిశుభ్రతే విషరోగాలకు విరుగుడు

**- జిల్లా కలెక్టర్ యం.జానకి**



పరిశుభ్రతే విషజ్వరాలకు విరుగుడని, పారిశుద్ధ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు పారిశుద్ధ్య వారోత్సవాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ యం.జానకి అధికారులను ఆదేశించారు. సోమవారం నెల్లూరు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వైద్య ఆరోగ్యశాఖ, మునిసిపల్ శాఖల అధికా రులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జిల్లాలోని 14మండలాల్లో డెంగీ జ్వరాలను గుర్తించినట్లు తెలిపారు. వెయ్యి రక్త నమూనాలను సేకరించగా 250 పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు ధీటుగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. డెంగీ నివారణకు ఆర్‌డబ్ల్యుఎస్, వైద్య ఆరోగ్యశాఖ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో కలుషిత నీరు వస్తే 0861-2306407 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. డెంగీ, సీజనల్ వ్యాధులు ప్రబలితే 9618232115కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. ఎన్‌ఆర్‌ఇజిఎస్ నిధులు రూ. 1.5 కోట్లు అందుబాటులో ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకుని పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రాజ్‌కుమార్, గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషా, జడ్పీ సిఇఓ రామిరెడ్డి, డిఎంహెచ్ఓ వి.లక్ష్మి, జిల్లా మలేరియా నివారణాధికారి వేణుగోపాల్ పాల్గొన్నారు.

# కేంద్రం సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి

**- టిడిపి నేత బీద రవిచంద్ర**



కేంద్రప్రభుత్వం సహకారంతోనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని టిడిపి జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బీద రవిచంద్ర అన్నారు. ఈ నెల 24న టిడిపి కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అమరావతి సభలో ప్రధాని నరేంద్రమోదీని ప్రత్యేక హోదా విషయం అడగడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు భయపడ్డారంటూ ప్రతిపక్షాలు విమర్శించడంలో అర్థం లేదన్నారు. అమరావతి నగర నిర్మాణ శంకుస్థాపనకు ముందే ప్రధానిని మూడుసార్లు ముఖ్యమంత్రి కలిసి చర్చించారని ఆయన పేర్కొన్నారు. నీతిఆయోగ్ నివేదిక వచ్చాక విభజన చట్టంలోని హామీలను అమలు చేస్తామని ప్రధాని అమరావతి సభలో చెప్పిన విషయాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. దేశంలోనే అత్యుత్తమ రాజధానిగా అమరావతిని తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అహర్నిశలు కృషి చేస్తుంటే, ప్రతిపక్షాలు లేనిపోని దుష్ప్రచారాలు చేయడం విచారకరమని ఆయన అన్నారు. టిడిపి నాయకులు చేజర్ల వెంకటేశ్వర్లురెడ్డి, కొండ్రెడ్డి రంగారెడ్డి, ముంగమూరు శ్రీధర కృష్ణారెడ్డి, కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, దేవరాల సుబ్రహ్మణ్యం, చాట్ల నరసింహారావు, నూనె మల్లికార్జున యాదవ్ తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## పొట్టేపాలెం యువత ఆధ్వర్యంలో

# ఆదాల జన్మదిన వేడుక



నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ తెలుగుదేశంపార్టీ ఇన్‌ఛార్జ్, మాజీ మంత్రి ఆదాల ప్రభాకర్ రెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం నెల్లూరు రూరల్ మండలం పొట్టేపాలెంలోని శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో ఆ గ్రామ తెలుగుదేశం నాయకులు పొన్నాల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆదాలకు ఆయురారోగ్యాలు కలుగజేయాలంటూ స్వామిని ప్రార్థించారు. అలాగే పొన్నాల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పొట్టేపాలెం యువకులు పెద్దసంఖ్యలో నెల్లూరులోని ఆదాల ఇంటికెళ్లి ఆయనను గజమాలలతో, శాలువాలతో సత్కరించారు.

## జాతీయ స్థాయి కవితల పోటీలు

సింహపురి ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో "మానవ సంబంధాలు దిగజారుతున్నాయి" అనే అంశంపై జాతీయస్థాయి తెలుగు కవితల పోటీలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్షులు తమ్మినేని పాండు, కార్యదర్శి కర్లపూడి కృష్ణయ్య, కోశాధికారి గజల్ నాగరాజ్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. నవంబర్ 21లోగా వచ్చిన కవితలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ కవితలు ఎంపిక చేసి నగదు బహుమతి అందజేయబడుతుందన్నారు. ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ రూ.3వేలు, తృతీయ రూ.2 వేలుగా నిర్ణయించబడిందన్నారు. Siffa పేజీని లైక్ చేసి కవితలు పోస్టు చేయా లన్నారు. ఇతర వివరాలకు 9491450504 నెంబరులో సంప్రదించాలని కోరారు.

# మెరాకిల్ వరల్డ్ రికార్డులో అమీర్‌జాన్



ఒంగోలు సృష్టి ఆర్ట్స్ అకాడమి, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో వంద గంటల నాన్‌స్టాప్ పెయింటింగ్ విభాగంలో దేశంలోని పలు రాష్ట్రాల నుండి వందమంది చిత్రకారులను ఎంపిక చేసి వారిచే ఒక్కొక్క చిత్రకారుడు 3గంటల వ్యవధిలో క్యాన్వాస్‌పై స్పాట్ పెయింటింగ్ చేసే కార్యక్రమం ఒంగోలు హైదరి క్లబ్‌లో ఈ నెల 25వ తేదీ ప్రారంభం కాగా, 26వ తేదీ నెల్లూరుకు చెందిన అమీర్‌జాన్ ఈ కార్యక్రమంలో పాల్గొని అప్పటికప్పుడు 3గంటల వ్యవధిలో క్యాన్వాస్‌పై "గౌతమ బుద్ధుడు" చిత్రాన్ని చిత్రించి మెరాకిల్స్ వరల్డ్ రికార్డ్ పార్టిసిపేషన్ జాబితాలో చోటు దక్కించుకున్నారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ బంకా ప్రకాష్‌రావు చేతుల మీదుగా మెరాకిల్స్ వరల్డ్ రికార్డ్ ధృవీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, నెహ్రూ యువకేంద్రం రిటైర్డ్ కో-ఆర్డినేటర్ ఎన్.చంద్రమోహన్‌రెడ్డి, సృష్టి ఆర్ట్స్ అకాడమి తిమ్మిర రవీంద్ర, చిత్రకారులు పాల్గొన్నారు.

# టిడిపిది అరాచక పాలన

**- వైఎస్సార్సీపి నాయకుల ధ్వజం**



అటు రాష్ట్రంలోనూ, ఇటు జిల్లాలోనూ తెలుగుదేశం పార్టీవారి అరాచక పాలన సాగుతోందని, అధికారపార్టీవారు చిత్తం వచ్చిన రీతిగా వ్యవహరిస్తూ చిత్తానుసారం పాలన సాగిస్తున్నారని వైఎస్సార్సీపి నాయకులు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వైఎస్సార్సీపి నాయకులు పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. కలువాయి జడ్పీటిసి సభ్యుడు బి.అనిల్‌కుమార్‌పై అక్రమకేసులు బనాయించారని నిరసిస్తూ జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్సీపి నేతలు, ఎమ్మెల్యేలు ధర్నాందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్సీపి జిల్లా అధ్యక్షుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే కాకాణి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ, వెంకటగిరి నియోజకవర్గంలో అధికారపార్టీ నాయకుడి ఆగడాలకు అంతులేకుండా పోయిందని ధ్వజమెత్తారు. అధికారులను బెదిరించి పనులు చేసుకుంటున్నారని ఆయన ఆరోపించారు. జడ్పీ ఛైర్మెన్ ఎన్నిక సమయంలో కలెక్టర్ మైక్ లాగినప్పుడు ఆ నాయకుడిపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకునివుంటే ఇప్పుడు ఇలాంటి దుస్థితి ఏర్పడివుండేది కాదన్నారు. పోలీసు అధికారులు కూడా అలాంటి నాయకులకు వత్తాసు పలుకుతున్నారని ఆయన ఆరోపించారు.

జడ్పీ ఛైర్మెన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ, ఎమ్మెల్యే మాటలు విని, కలువాయి జడ్పీటిసి సభ్యునిపై అక్రమకేసులు నమోదు చేయడం విచారకరమన్నారు. కలువాయి చెరువుకు సంబంధించిన సొసైటీలో 302 మంది సభ్యులు వుండగా, అందులో 200 మంది దాకా వైఎస్సార్సీపికి చెందినవారు వుండడంతో, ఆ ఎన్నికలను ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయించారని ఆయన ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అధికారులపై వత్తిడి తెచ్చారన్నారు. జడ్పీటీసీపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. జిల్లా అధికారులు పసుపు చొక్కాలు వేసుకుని బాధ్యతలను విస్మరించి ప్రవర్తిస్తున్నారంటూ ఆయన విమర్శించారు. సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్లాడుతూ, అధికారపార్టీ నాయకులు వైఎస్సార్సీపిని అణగదొక్కేందుకు ప్రయత్నాలుచేస్తున్నారన్నారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాపకుమార్‌రెడ్డి మాట్లాడుతూ, టిడిపి పాలనలో అవినీతి అధికమైందన్నారు. నెల్లూరు ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని, అక్రమాలకు పాల్పడుతున్న ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ, జిల్లాలో టిడిపి అరాచకాలను నిరోధించాలని, కలెక్టర్, ఎస్పీ తగు చర్యలు తీసుకోవాలని అన్నారు. ధర్నా అనంతరం జేసీ ఇంతియాజ్‌కు ఆ మేరకు వారు వినతిపత్రం సమర్పించారు.

# నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి


**------------------ వ్యాపారులకు డిసిసిబి ఛైర్మెన్ సూచన**



జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ వాణిజ్య సముదాయంలో వ్యాపారులు నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని డిసిసిబి ఛైర్మెన్ మెట్టుకూరు ధనుంజయరెడ్డి సూచించారు. ఈ నెల 24న నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌వద్ద వున్న ఆ బ్యాంక్ సమావేశమందిరంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంక్ ఆవరణంలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో 43 షాపులను వ్యాపారులకు అద్దెకు ఇచ్చామని, అయితే కొంతమంది వ్యాపారులు నిబంధనలను అతిక్రమించి దుకాణాలను వేరేవారికి ఇస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలా కాక ఎవరికి కేటాయించిన షాపుల్లో వారే వ్యాపారాలను నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. ప్రతి నెలా 10వ తేదీ లోపు అద్దె చెల్లించాలన్నారు. భవనాల మరమ్మతులతో పాటు, మరుగుదొడ్ల సౌకర్యం కూడా ఏర్పాటుచేస్తామని, వ్యాపారులు అసోసియేషన్‌గా ఏర్పడి బాధ్యతగా దుకాణాలను సక్రమంగా నిర్వహించుకోవాలని ఆయన అన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ సిఇఓ రమణారెడ్డి, డిజిఎం ఉషారాణి, డైరెక్టర్ బుర్రా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అధునాతన గృహోపకరణాలకు చిరునామా
అమ్మ ఫర్నిచర్ మాల్
మినీబైపాస్‌రోడ్, నెల్లూరు.
Latest & New Models
ప్రతి కొనుగోలు పై డిస్కౌంట్ కలదు

## కల్యాణ వైభవం...!



చెన్నై వాస్తవ్యులు డేగా నరసారెడ్డి - ప్రసూనల ఏకైక కుమారుడు **దినేష్ - సాయి మాలవిక** (నెల్లూరు, చింతారెడ్డిపాలెం వాస్తవ్యులు ఇస్కా బ్రహ్మానందరెడ్డి - మీరాదేవిల కుమార్తె)ల వివాహం ఈ నెల 25వ తేదీ నెల్లూరు కెజికె కల్యాణ మండపం నందు, రిసెప్షన్ అదేరోజు సాయంత్రం నెల్లూరు మినర్వా గ్రాండ్‌లో వైభవంగా జరిగాయి. నూతన వధూవరులకు 'లాయర్' శుభాకాంక్షలు.

### పుట్టంరాజువారి కండ్రిగ పాఠశాల

# విద్యార్థులకు బ్యాగులు, పుస్తకాలు



విద్యార్థులకు బ్యాగులు, పళ్లేలు పంపిణీ చేస్తున్న సబ్‌కలెక్టర్ గిరీషా, రోటరీ ప్రతినిధులు

గూడూరు రోటరీ క్లబ్ వారు సోమవారం పుట్టంరాజువారి కండ్రిగ పాఠశాలలోని 34 మంది విద్యార్థులకు రూ.70వేలు విలువ చేసే పాదరక్షలు, రెండు జతల దుస్తులు, బ్యాగులు, పుస్తకాలు, పళ్లేలు, గ్లాసులను అందజేశారు.

ప్రముఖ క్రికెటర్, ఎంపి సచిన్ తెండూల్కర్ దత్తత గ్రామం పుట్టంరాజువారికండ్రిగలో పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్లు రోటరీ క్లబ్ ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పుట్టంరాజువారి కండ్రిగ గ్రామాన్ని సచిన్ దత్తత తీసుకోవడంతో దేశంలోనే ప్రత్యేక గుర్తింపు వచ్చిందని తెలిపారు. కార్పొరేట్ స్థాయిలో పాఠశాలలో వసతులను ఏర్పాటు చేస్తామని తెలిపారు. దాతలుగా దివ్యా ట్రస్టు ప్రతినిధి శీనయ్య, ఆర్.శివబాలన్ వ్యవహరించారు.

ఈ కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షులు అశోక్ చక్రవర్తి, రోటరీ జిల్లా గవర్నర్ గౌతం జాగీర్‌దార్, ఉప విద్యాశాఖాధికారిణి మంజులాక్షి, గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషా, ఎంపిడివో భవాని, సర్పంచి బుజ్జా నాగేశ్వరరావు, రోటరీక్లబ్ ప్రతినిధులు దశరథ రామిరెడ్డి, బొమ్మిరెడ్డి సురేంద్రరెడ్డి, కె.మునిగిరీష్, మునిరాజా, హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. కాగా గూడూరు పట్టణంలోని ఎస్‌కెఆర్ జూనియర్ కళాశాలలో రూ.70వేలు విలువ చేసే 24బెంచీలు, 10ఫ్యాన్లు విద్యార్థులకు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, మయూరి శ్యాంయాదవ్, నాగేంద్రప్రసాద్, దీనదయాళ్, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## గూడూరు డివిజన్ వార్తలు

### మున్సిపల్ పాఠశాలకు

# రోటరీ వెస్ట్‌క్లబ్ విద్యా సామాగ్రి




విద్యా సామాగ్రిని పంపిణీ చేస్తున్న రోటరీ వెస్ట్ క్లబ్ ప్రతినిధులు

గూడూరు రెండో పట్టణంలోని మాలవ్యానగర్ ప్రాంతంలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం నాడు గూడూరు రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యాన విద్యార్థులకు విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. పట్టణంలోని సుందరరామిరెడ్డి ఛారిటబుల్ ట్రస్టు దాతృత్వంతో రోటరీ క్లబ్ వెస్ట్ జిల్లా గవర్నర్ జాగీదర్ విద్యార్థులకు విద్యా, క్రీడా సామాగ్రిని అందజేశారు. వీటిని సక్రమంగా వినియోగించుకుని ఉన్నత చదువు వైపు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బొమ్మిడి శ్రీనివాసులు, మహేంద్రరెడ్డి, నాగులు, రామకృష్ణారెడ్డి, వాసుగౌడ్, పిఎమ్‌రావు, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సమస్యలు పరిష్కరించండి



సమస్యలు పరిష్కరించాలంటూ సబ్‌కలెక్టర్ గిరీషాకు అర్జీలు సమర్పిస్తున్న గ్రామస్తులు

గూడూరు డివిజన్ పరిధిలోని పలు మండలాలకు చెందిన అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ గూడూరు సబ్‌కలెక్టర్ గిరీషాకు సోమవారం వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా సోమవారం ఆయా గ్రామాలకు చెందిన అర్జీదారులు సమస్యలను మొరపెట్టుకున్నారు. ప్రధానంగా భూ సమస్యలు, సర్వే కొలతలు, పట్టాదారు పాసు పుస్తకాలు, ఇంటి స్థలాలు తదితర సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. కాగా, గూడూరు తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ సి.వెంకటనారాయణమ్మను కలిసి సోమవారం ప్రజావిజ్ఞప్తుల దినం సందర్భంగా పలు గ్రామాలకు చెందిన అర్జీదారులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# పెంచిన ఛార్జీలను తగ్గించాలి

**- ఎమ్మెల్యే పాశం**



ఆర్టీసీ డిపో ముందు ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి తదితరులు

ప్రభుత్వం పెంచిన ఆర్టీసీ ఛార్జీలను తక్షణం తగ్గించాలని గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ డిమాండ్ చేశారు. గూడూరు ఆర్టీసీ బస్సు డిపో ముందు సోమవారం తమ పార్టీ నాయకులతో కలసి నిరసన, ధర్నా చేపట్టారు. సామాన్య ప్రజలపై ఆర్టీసీ భారం మోపడంతో ప్రయాణం కష్టంగా మారుతోందన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ఆర్టీసీ డిఎంకు వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో వైకాపా నాయకులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, మల్లు విజయకుమార్‌రెడ్డి, వాటంబేటి శివకుమార్, నాశిన నాగులు, నాగరాజు, మోహన్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్యకర్తలకు అండగా తెదేపా!

**- జ్యోత్స్నలత**



తెదేపా నాయకుల నుండి అర్జీలు స్వీకరిస్తున్న రాధాజ్యోత్స్నలత

గూడూరులో కార్యకర్తలకు అండగా ఉండి నిత్యం పనులు చేస్తామని తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాధాజ్యోత్స్నలత హామీ ఇచ్చారు. పట్టణంలోని రోడ్లు భవనాల శాఖ అతిథిగృహంలో సోమవారం పలు మండలాలకు చెందిన కార్యకర్తలు తమ సమస్యలను పరిష్కరించాలని ఆమెకు విన్నవించారు. పట్టణంలోని 3వ వార్డుకు చెందిన జ్యోతి అనే తెలుగుదేశం పార్టీ కార్యకర్త చనిపోవడంతో ఆ కుటుంబానికి 2లక్షల పరిహారాన్ని సోమవారం అందజేశారు.

ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పులిమి శ్రీనివాసులు, నాగరాజు, కోటేశ్వరరావు, రవీంద్రరెడ్డి, కోటారెడ్డి, శివకుమార్, గోను విక్రం, శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

### చెస్ పోటీల

# గోడపత్రిక ఆవిష్కరణ



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సబ్‌కలెక్టర్ గిరీషా, మున్సిపల్ ఛైర్‌పర్సన్ దేవసేన

ఈ నెల 30వ తేదీ నుంచి జరగనున్న మనపాటి మస్తానయ్య స్మారక రాష్ట్ర చెస్‌పోటీలకు సంబంధించిన గోడపత్రికను సబ్‌కలెక్టర్ గిరీషా సోమవారం విడుదల చేశారు. పట్టణంలోని సబ్‌కలెక్టర్ కార్యాలయంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ పొనకా దేవసేన, చెస్ క్రీడా ప్రతినిధులు గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు పోటీలు నిర్వహించడాన్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో మనపాటి రవీంద్ర, చెస్ క్రీడా నిర్వాహకులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ ఇంటర్వ్యూలు

గూడూరు పట్టణ, గ్రామీణ ఐసిడిఎస్ పరిధిలోని ఖాళీగా వున్న అంగన్‌వాడీ సిబ్బంది నియామకం కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఈ నెల 31వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు అర్బన్, రూరల్ సిడిపివోలు ఉమామహేశ్వరి, విజయలక్ష్మిలు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అభ్యర్థులకు గూడూరు సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు గత నెలలో నిర్వహించాల్సిన ఇంటర్వ్యూలు అనివార్య కారణాల వల్ల వాయిదా పడటంతో ప్రస్తుతం తిరిగి అభ్యర్థులకు వివిధ శాఖల అధికారులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు గమనించాలని కోరారు.

శ్రీను గల్పిక

# మట్టి – నీళ్ళ రాజధాని

విజయవాడలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కార్యాలయం. చంద్రబాబుతో పాటు కేంద్రమంత్రి, టాకింగ్ రత్న వెంకయ్యనాయుడు, అరుణ్‌జైట్లీ, సుజనాచౌదరి, అశోక్‌గజపతిరాజు, నిర్మలా సీతారామన్, సీఎం రమేష్, గల్లా జయదేవ్, పి.నారాయణలు వున్నారు. అది విజయదశమి ముందురోజు, ఓ పక్క అమరావతి శంకుస్థాపనకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. చంద్రబాబు వుండి వెంకయ్యతో... రేపు మోడీజీ వస్తున్నారు కదా, ఆయన మీదే ఎన్నో ఆశలు పెట్టుకున్నాం, ఆయన రాకుంటే పరువుపోతుందన్నాడు. మీకెందుకు ఆ డౌటు... ఆయన ఖచ్చితంగా వస్తున్నారు. శంకుస్థాపన రోజు ఏమేం ఇవ్వాలని చెప్పి నన్ను ప్రత్యేకంగా కూడా అడిగారని వెంకయ్య అన్నాడు. ఏమో, ఆయన ప్రధాని అయ్యింది మొదలు చూస్తున్నాను కదా, నా ముఖం చూస్తే చాలు చిటపటలాడుతున్నట్లు ముఖం పెడతాడు. నాతోకంటే ఆ జగన్‌తోనే ఫ్రీగా, నవ్వుతూ మాట్లాడుతాడు. నా ముఖం చూసేనేమో ఇంతవరకు రాష్ట్రానికి ఏమీ ఇవ్వలేదు అని చంద్రబాబు చెప్పాడు. దానికి వెంకయ్య... అంత అధైర్యపడమాకు చంద్రబాబు... నీ మనసులో ఏమైతే వుందో, నువ్వు ఏదైతే కోరుకుంటున్నావో అది నరేంద్ర మోడీ తప్పక తీరుస్తాడని భరోసా ఇచ్చాడు. తర్వాత చంద్రబాబు నారాయణతో... రేపు రాజధాని శంకుస్థాపనలో మట్టి, నీళ్లే ప్రధాన అంశం. రాష్ట్రంలోని ప్రతి గ్రామం నుండి కిలో మట్టి, పావులీటరు నీళ్లు రావాలి. ఏ గ్రామం నుంచైనా ఈ రెండూ రాకపోతే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోండని అన్నాడు. నారాయణ అందుకుని... ఏం ఫర్వాలేదు సార్, దానికి పకడ్బందీగా ఏర్పాట్లన్నీ చేసాం. ఏ గ్రామం నుండైనా నీళ్లు, మట్టి రావడం మిస్సయితే గంటలో ఆ గ్రామాలకు వెళ్లి మట్టి, నీళ్లు తెచ్చే విధంగా ఓ పది హెలికాప్టర్లను కూడా సిద్ధంగా వుంచామని చెప్పాడు. వెంటనే వెంకయ్య... శంకుస్థాపనకు 400కోట్లు ఖర్చు పెడుతున్నారనే ప్రచారం వచ్చింది... దీని మీద ప్రధానమంత్రి కార్యాలయం సీరియస్‌గా వుంది. ఇంతకీ ఖర్చెంత పెడుతున్నారని అడిగాడు. దానికి చంద్రబాబు... అబ్బే పెద్ద ఖర్చు కావడం లేదు, 9టెంకాయలు, కిలో పసుపు, అరకిలో కుంకుమ, వచ్చిన వాళ్లందరికీ తలకొక రూపాయి లెక్కన భోజనం, అంతా ఫ్రీ... ఈ లెక్కన చూస్తే చాలా సింపుల్‌గా శంకుస్థాపన చేస్తున్నట్లేనని చెప్పాడు. రాజధాని నిర్మాణానికి ఇంకెవరన్నా సాయం చేస్తున్నారా అని నిర్మలా సీతారామన్ అడిగింది. అమెరికా, జర్మనీ, జపాన్, చైనా, సింగపూర్ దేశాల వాళ్లు సహకరిస్తున్నారని నారాయణ తెలిపాడు.

★★★★★

విజయదశమి పర్వదినం.. అమరావతి శంకుస్థాపన వేదిక. సర్వమత ప్రార్థనలు, హోమాలు, యాగాలు అన్నీ పూర్తయ్యాయి. మిస్సయిన గ్రామాలనుండి నీళ్లు–మట్టిని తెస్తూ హెలికాప్టర్లు బిజీగా తిరుగుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోడీ శంకుస్థాపన చేసిన అనంతరం సభ మొదలైంది. మొదట అమెరికా అధ్యక్షుడు ఒబామా మాట్లాడుతూ... చంద్రబాబు చాలా అద్భుతమైన రాజధాని కడుతున్నాడు. కేవలం అన్ని ప్రాంతాల నుండి తెచ్చిన మట్టి, నీళ్లతోనే ఒక రాజధాని నగరాన్ని నిర్మించడమనేది చరిత్రలోనే అద్భుతం. ఈ టెక్నాలజీని మా దేశంలో కూడా అభివృద్ధి పరుస్తాం. చంద్రబాబు లాంటి నాయకుడు అమెరికాలో వుండుంటే జీవితాంతం ఆయనే ఆ దేశ అధ్యక్షుడుగా వుండేవాడు. ఏదేమైనా అమరావతి రాజధానికి మా వంతు సహకారంగా నయాగారా జలపాతం నుండి తెచ్చిన అరలీటర్ నీళ్లు, వైట్‌హౌస్‌లో నుండి తెచ్చిన ఒకటిన్నర కిలో మట్టి అందిస్తున్నామంటూ చంద్రబాబు చేతికి రెండు గిఫ్ట్‌ప్యాక్ చేసిన పెట్టెలిచ్చాడు. తర్వాత జపాన్ ప్రధాని షింజోఅబే మాట్లాడుతూ... మట్టి – నీళ్లతోనే ఒక రాజధాని నగరాన్ని నిర్మించడమనేది టెక్నాలజీ పరంగా ఎంతోముందున్న మాకే సాధ్యం కావడం లేదు. చంద్రబాబు అసాధ్యుడు... ఈ భూమ్మీద అలెగ్జాండర్‌కు ఓ చరిత్ర వుంది, అశోకుడికి, గౌతమ బుద్ధుడికి ఓ చరిత్ర వుంది. అలాగే ప్రపంచంలోని అన్ని ప్రాంతాల మట్టి, నీళ్లతో రాజధానిని కట్టిన చరిత్ర చంద్రబాబు అకౌంట్‌లోనే వుంటుందంటూ తాను తెచ్చిన టోక్యో మట్టిపాత్రను, హిరోషిమా నీళ్ల బాటిల్‌ను చంద్రబాబుకు అందజేశాడు. తర్వాత చైనా అధ్యక్షుడు జింగ్‌పింగ్ మాట్లాడుతూ... మా గ్రేట్ చైనా వాల్ కంటే అమరావతి రాజధానికి ఎక్కువ ఖ్యాతి రానుంది, ఇక్కడ సంబరాలు, మట్టి – నీళ్లతో రాజధాని కట్టే టెక్నాలజీని చూస్తుంటే మా బీజింగ్‌ను కూడా పూర్తిగా కూలగొట్టి మళ్లీ ఈ అధునాతన మట్టి – నీళ్ల టెక్నాలజీతో కట్టాలనిపిస్తోంది. అమరావతి రాజధానికి మా వంతుగా బీజింగ్ మట్టి, షాంగై నీళ్లు ఇస్తున్నామంటూ చంద్రబాబు చేతికి రెండు పాత్రలిచ్చాడు. తర్వాత ఆయా దేశాల నుండి వచ్చిన ప్రతినిధులు కూడా మీ రాజధానికి మావంతు సహకారం అంటూ మట్టిని, నీళ్లను అందించారు. ఆ క్రమంలో సింగపూర్ ప్రధాని లీ వంతు వచ్చింది. కాని ఆయన కనిపించలేదు. సింగపూర్ ప్రధాని 'లీ' ఏమయ్యాడని చంద్రబాబు ఆతృతగా నారాయణను అడిగాడు. సింగపూర్ నుండి ఫ్లైట్‌లో మట్టి, నీళ్లు తెస్తుంటే మధ్యలో దాహం వేసి ఏమరుపాటుగా ఆ నీళ్లు తాగేసాడట. అర్జంట్‌గా నీళ్లు తేవడానికి మళ్లీ విమానం వేసుకుని సింగపూర్ పోయాడని ఒక గంటలో వచ్చేస్తాడని నారాయణ చెప్పాడు. అందుకు చంద్రబాబు... ఏడ్చినట్లే వుంది... వాళ్లు తాగేదే, మనం ఇక్కడ నుండి పంపించిన నీళ్లు. అవేవో ఇక్కడే పట్టుకుని ఇచ్చుంటే పోయేది కదా అని అన్నాడు.

చివరిగా ప్రధాని నరేంద్ర మోడీ వంతు వచ్చింది. ఇంత అద్భుతంగా రాజధాని కడుతున్న చంద్రబాబుకు నేనే విధంగా సాయపడగలనా అని ఆలోచించాను, ఆయన చేస్తున్న కృషికి ప్రత్యేకహోదా ఇచ్చినా, ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చినా తక్కువే అవుతుంది. ఆయన చేస్తున్న అమరావతి యజ్ఞంలో నేనూ భాగస్వామిని కావాలనుకున్నాను, అందుకే ఈ ప్రపంచంలో ఇంతవరకు ఎవరికీ ఇవ్వని అమూల్యమైన కానుకను ఇస్తున్నాను. ఇది పార్లమెంటు ప్రాంగణంలో తీసిన కిలో మట్టి, ఇవి యమునా నదిలో పట్టిన లీటర్ నీళ్లు. ఇంతవరకు దేశంలో ఏ రాజధాని నిర్మాణానికి కూడా ఇవి ఇవ్వలేదు. తొలిసారి నీకే ఇస్తున్నాను, ఇంతకంటే ఏం చేయగలనయ్యా నీ కృషికి అంటూ రెండు పాత్రలు చంద్రబాబు చేతిలో పెట్టాడు.

అది చూసి అక్కడున్న ప్రతి ఒక్కరూ నోరెళ్లబెట్టగా వెంకయ్యనాయుడు మాత్రం ఇది అద్భుతం, చంద్రబాబు మీద మోడీ కున్న అభిమానానికి ఇది తార్కాణం అంటూ చప్పట్లుకొట్టాడు.

## మేషం



అశ్విని, భరణి, కృతిక 1 పాదము

శుభకార్యములు నిర్ణయం కాగలవు. గృహోపకరణాలు, కొత్త వస్తువులు విలువైన వాటిని సమకూర్చుకొంటారు. ఆర్థిక సర్దుబాటులందు కొంత తేడాలుంటాయి. ఆదాయము తగ్గుతుంది. బంధువర్గంలో మీపై అసంతృప్తి ఉంటుంది. ప్రభుత్వ అనుమతులు, బిల్లులు ఆలస్యం కాగలవు. చిన్న పరిశ్రమలు, వ్యవసాయదారులకు ఆశాజనకంగా ఉండవచ్చును.

## వృషభం



కృతిక 2, 3, 4 పాదాలు, రోహిణి, మృగశీర్ష1, 2పాదాలు

ఇతరుల సలహాల కారణంగా పొరపాట్లు లేకుండా చూచుకొనండి. అనుకున్న పనులు వేగంగా జరిగి నెరవేరతాయి. స్థిరాస్తుల వ్యవహారాలు, ఋణ వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధి ఉండి ఆదాయం పెరుగుతుంది. శుభకార్యాల ప్రయత్నాలలో వున్న వారికి అనుకూలత బాగుంటుంది. అధికారులు, మిత్రుల సహకారం బాగుంటుంది.

## మిథునం



మృగశీర్ష 3,4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3పాదాలు

ఉద్యోగ ప్రయత్నాలు చేసేవారికి అనుకూలత బాగుంటుంది. ఆర్థిక ఇబ్బందులుంటే సర్దుబాటు కాగలవు. చేపట్టిన పనులకు పరిస్థితులు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాలు వేగం అందుకొని ఆదాయం పెరుగుతుంది. వర్తకులతో యజమానులు జాగ్రత్త పడండి. కోర్టు వ్యవహారాలలో అనుకూలత బాగుంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు.

## కర్కాటకం



పునర్వసు 4 పాదం, పుష్య, ఆశ్లేష

వృత్తి వ్యాపారాలలో ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలు ఆలస్యం కావచ్చును. బిడ్డల విద్యా, వివాహాలకు దృష్టి పెడతారు. ఆర్థికంగా కొద్దిపాటి ఇబ్బందులుండినా అధిగమిస్తారు. బాగా శ్రమ తీసికొంటే గాని పనులు జరగని పరిస్థితులుంటాయి. సంబంధం లేని విషయాలలో జోక్యం చేసికొనవద్దు. స్థిరాస్తుల క్రయవిక్రయాలు జరుగగలవు.

## సింహం



మఖ, పుబ్బ, ఉత్తర 1పాదము

ఇంటి రిపేర్లు, వస్తు వాహన రిపేర్లుంటాయి. అనుకున్న పనులు హడావిడిగా జరుగుతాయి. వృత్తి వ్యాపారాలకు చెందిన ఆర్థిక విషయాలలో మీ అంచనాలు ఫలిస్తాయి. ఆదాయం పెరుగుతుంది. ఆత్మీయులు, బంధువులతో మనోభేదాలు రాకుండా సర్దుబాటు చేసికొనండి. కోర్టు వ్యవహారాలలో బాకీల వసూళ్ళందు అనుకూలత ఉంటుంది.

## కన్య



ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1, 2 పాదాలు

శుభవార్తలు వింటారు. స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. సోదరులు, బిడ్డలతో విభేదాలు రాకుండా చూచుకొనండి. పన్నులు, చెల్లింపులు ఇతరులవి సకాలంలో చెల్లించగలరు. వృత్తి వ్యాపారాలలో అభివృద్ధికై అవకాశాలు దొరకగలవు. రాబడి సంతృప్తికరంగా ఉంటుంది. విద్యా ప్రగతి బాగుంటుంది. కోర్టు వ్యవహారాలలో అనుకూలత ఉంటుంది.



బ్రహ్మశ్రీ స్వయంపాకుల శ్రీనివాసులు
బాలాజీనగర్, నెల్లూరు

## రాశి – మీ వాసి

తేది. 30.10.2015 నుండి
తేది. 5.11.2015 వరకు

ఈ వారము మీనంలో కేతువు, వృషభ, మిథున కర్కాటక సింహ రాశులలో చంద్రుడు, సింహంలో శుక్రకుజులు, 2వ తేదీ నుండి కన్యలో కుజుడు, కన్యలో రాహువు, తులలో రవిబుధులు, వృశ్చికంలో శని సంచరిస్తారు.

**పంచాంగము:**

**ముహూర్తములు**

తేది 29 గురువారం రాత్రి గంట 11.17 నుండి రాత్రి 1.30 వరకు కర్కాటక లగ్నమున వివాహ గృహప్రవేశములు.

తేది 31 శనివారం ఉదయం 10.30 నుండి 12.0లోగా ధనుర్లగ్నమున శంకుస్థాపన వివాహములు.

### ఆశ్వయుజ మాస కృష్ణపక్షతిథులు

| | | | |
|---|---|---|---|
| తేది. 30 | శుక్ర | తదియ | ప॥ గం.11.55వ॥ |
| తేది. 31 | శని | చతుర్థి | ఉ॥ గం.10.31వ॥ |
| తేది. 1 | ఆది | పంచమి | ఉ॥ గం.9.36వ॥ |
| తేది. 2 | సోమ | షష్ఠి | ఉ॥ గం.9.06వ॥ |
| తేది. 3 | మంగళ | సప్తమి | ఉ॥ గం.9.07వ॥ |
| తేది. 4 | బుధ | అష్టమి | ఉ॥ గం.10.04వ॥ |
| తేది. 5 | గురు | నవమి | ఉ॥ గం.10.42వ॥ |

## తుల



చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఋణాల చెల్లింపులు తప్పక జరుపుతారు. ఉద్యోగులు విధి నిర్వహణలో మాటలు పడకుండా జాగ్రత్త పడండి. విలువైన వస్తువులు, పత్రాలు జాగ్రత్త పరచుకొనండి. ఖర్చులు పెరుగుతాయి. వృత్తి జీవనంలో అభివృద్ధి రాబడి ఉంటుంది. వ్యాపారవృద్ధి అవకాశాలు చేజారవచ్చు. ఆదాయము సామాన్యంగా ఉంటుంది. పెండింగ్‌లోగల సమస్యలు సర్దుబాటవుతాయి.

## వృశ్చికం



విశాఖ 4 పాదం, అనూరాధ, జ్యేష్ఠ

ఆర్థిక స్థిరాస్తుల లావాదేవీలందు మేలు జరుగుతుంది. చిన్న చిన్న ఆటంకాలుండినా అనుకున్న పనులు సక్రమంగా జరుగుతాయి. వ్యాపారాలలో వృత్తి జీవనంలో పురోభివృద్ధి బాగుంటుంది. బాంధవ్యాలు బలపడతాయి. భాగస్వామిక వ్యాపార అవకాశాలు లభించగలవు. శుభకార్యాలకు సమయం నిర్ణయం కాగలదు. అల్లులతో తగాదాలు రాకుండా చూచుకొనండి.

## ధనుస్సు



మూల, పూర్వాషాఢ, ఉ.షాఢ 1 పాదము

వృత్తి వ్యాపారాలలో ఆదాయం, అభివృద్ధి బాగుంటుంది. వ్యవహారాలలో తగిన నిర్ణయాలు తీసుకొని లాభపడతారు. నిర్మాణదారులకు కాంట్రాక్టర్లకు ఆర్థిక సమస్యలుంటాయి. పలుకుబడి కొరకు చేసే ఖర్చులు పెరుగుతాయి. వ్యవసాయదారులకు ఋణాలు లభించగలవు. స్వల్ప కుటుంబ సమస్యలుంటాయి. రావలసిన బాకీలు కొంత వసూలు కావడం జరుగుతుంది.

## మకరం



ఉ.షాఢ 2, 3, 4 పాదాలు, శ్రవణ, ధనిష్ఠ 1, 2 పాదాలు

స్థిరాస్తుల లావాదేవీలు వాయిదా పడతాయి. వృత్తి ఉపాధి రంగాలు సామాన్యంగా జరుగుతాయి. బిడ్డల విద్యా ఉద్యోగ విషయాలపై ఆందోళన ఉంటుంది. ఆర్థిక స్థితి ఇబ్బందికరంగా ఉంటుంది. అనుకోని అదనపు ఖర్చులతో ఇబ్బంది పడతారు. వ్యాపారరీత్యా అవకాశాలు తగ్గి సామాన్య ఆదాయముంటుంది. పనులు సక్రమంగా జరుగక చికాకు పడతారు.

## కుంభం



ధనిష్ఠ 3, 4 పాదాలు, శతభిష, పూ.భాద్ర 1,2,3 పాదాలు.

కోర్టు కేసులు వాయిదా పడవచ్చును. మాటల్లో గాని చేతల్లో గాని తొందరపాటు ప్రదర్శించవద్దు. వ్యాపారాభివృద్ధికి అవకాశాలు చేజారిపోతాయి. ఆదాయం సామాన్యం. బంధువులతో పేచీలు రావచ్చును. అప్పులు ఇవ్వడం, హామీలివ్వడం చేయవద్దు. విద్యా ప్రగతి బాగుంటుంది. షేర్లు నిరుత్సాహ పరుస్తాయి. ఉద్యోగులకు స్థానమార్పు, బాధ్యతలు పెరగడం ఉంటుంది.

## మీనం



పూర్వాభాద్ర 4 పాదం, ఉ.భాద్ర, రేవతి

ఉద్యోగ ప్రయత్నాలలో అనుకూలత ఉంటుంది. శుభకార్యాలు నిర్ణయం కాగలవు. పెండింగ్ వ్యవహారాలలో సంప్రదింపులు జరుపుతారు. ఇంటి వ్యవహారాలను, ఆర్థిక వ్యవహారాలను జాగ్రత్తగా నడపండి. తొందరపడి నిర్ణయాలు తీసుకొనవద్దు. వృత్తి వ్యాపారాలలో రాబడి సంతృప్తికరం. అదనపు ఖర్చులుండినా ఇబ్బందులుండవు. ఉద్యోగులకు అదనపు పని భారముంటుంది.

## కాలధర్మం

# శ్రీమతి లిల్లీ స్వామిదాస్



ప్రముఖ ఆంగ్ల పాఠశాల శ్రీ స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ వ్యవస్థాపకులు స్వర్గీయ స్వామిదాస్ గారి సతీమణి శ్రీమతి లిల్లీ స్వామిదాస్ తన 96వ యేట అక్టోబర్ 28వ తేదీ బుధవారం తెల్లవారుజామున కన్ను మూసారు. ఆమెకు ఆరుగురు కుమార్తెలు. 1919వ సంవత్సరం మచిలీపట్నంలో జన్మించిన ఆమె 1946లో అప్పటి జిల్లా విద్యాశాఖలో పర్యవేక్షణాధికారిగా పనిచేస్తుండిన సూళ్లూరుపేటకు చెందిన బి.స్వామిదాస్‌ను వివాహమాడారు. శ్రీమతి లిల్లీ స్వామిదాస్‌ను వివాహమాడిన అనంతరం అదృష్ట లక్ష్మిల్లాంటి ఆరుగురు కుమార్తెలకు జన్మనివ్వడంతో పాటు జిల్లా విద్యాశాఖాధికారిగా ఉన్నతస్థాయికి ఎదిగిన స్వామిదాస్ జిల్లా వ్యాప్తంగా మంచి పేరుప్రఖ్యాతలు పొంది పదవీవిరమణ చేశారు. 1970వ సంవత్సరంలో తన సొంత పేర నెల్లూరు నగరంలో స్వామిదాస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌ను స్థాపించి జిల్లాలోనే మొట్టమొదటి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌గా ఆ స్కూల్‌ను మంచి ఉన్నత స్థాయికి తీసుకురావడంతో పాటు గత ఐదు దశాబ్దాల కాలంలో ఎంతో మంది డాక్టర్లను, ఇంజనీర్లను, ఐఏఎస్, ఐపిఎస్ అధికారులను ప్రపంచ వ్యాప్తంగా అందించిన ఘనతను ఆ పాఠశాలకు తెచ్చారు. పాఠశాల ప్రారంభించిన నాటి నుండి భర్తకు సహకరిస్తూ తాను కూడా పూర్తి స్థాయిలో పాఠశాల కార్యకలాపాలను పర్యవేక్షిస్తూ పాఠశాల అభ్యున్నతికి శ్రీమతి లిల్లీ స్వామిదాస్ కూడా విశేష కృషి జరిపారు. మనుమలు, మనుమరాళ్లు, మునిమనుమలతో పరిపూర్ణ జీవితాన్ని గడిపి తన 96వ యేట పరమపదించిన శ్రీమతి లిల్లీ స్వామిదాస్ ఆత్మశాంతికై ప్రార్థిస్తూ వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతోంది 'లాయర్'.

# ఈ జ్వరాలకు అంతం లేదా?



విషజ్వరాలతో జిల్లాలో ఇప్పటికే 8మంది చనిపోయారని, నెల్లూరులో ఇద్దరు మృతి చెందారని, ఈ జ్వరాలకు అంతం లేదా అని నెల్లూరు నగర ఎమ్మెల్యే పి.అనిల్‌కుమార్‌యాదవ్ ప్రశ్నించారు. ఈ నెల 29న నెల్లూరులోని కోదండరామపురం, ఉస్మాన్ సాహెబ్‌పేట, రామచంద్రాపురం ప్రాంతాలలోని కాలువలలో దోమల నిర్మూలన కోసం గంబూసియా చేపలను ఆయన వదిలారు. ఈ సందర్భంగా అనిల్ మాట్లాడుతూ నగరంలో ఏ ఆసుపత్రి చూసినా జ్వరపీడుతులతో కిటకిటలాడుతున్నాయన్నారు. నగరంలో పారిశుద్ధ్యానికి పాతరేసారని, అందుకే దోమలు విజృంభించి విషజ్వరాలు ప్రబలుతున్నాయన్నారు. దోమల నిర్మూలన కోసం తమవంతు కర్తవ్యంగా ఫాగింగ్, ఆయిల్‌బాల్స్, గంబూసియా చేపలను వదిలే కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నగరంలో పారిశుద్ధ్యంపై ఎంత ఖర్చు పెడుతున్నారో శ్వేతపత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# పక్షవాతంపై అప్రమత్తంగా ఉండాలి



పక్షవాతంపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సింహపురి ఆసుపత్రి ప్రముఖ నరాల వైద్యనిపుణులు సుజయ్‌సదా పేర్కొన్నారు. బుధవారం చింతారెడ్డిపాళెంలోని సింహపురి ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లక్షమందిలో ఒకరు పక్షవాతం బారిన పడుతున్నారని, నగరాల్లో నివసిస్తున్న వారిలో ప్రతి వెయ్యిమందిలో ఒకరు పక్షవాతానికి గురౌతున్నట్లు తెలిపారు. గ్రామాల్లో వున్నవారు సరైన అవగాహన లేక పక్షవాతం బారిన పడి అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పక్షవాతంపై అవగాహన కల్పించి ప్రజలను చైతన్యవంతులను చేసేందుకు సింహపురి ఆసుపత్రి ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.



## కావలి కబుర్లు

# దమ్ముంటే బహిరంగ చర్చకు రండి

- వైసిపి నాయకులకు సవాల్ విసిరిన టిడిపి సభ్యులు



ప్రజల శ్రేయస్సు కోసం నిరంతరం తపించే బీద సోదరులు ప్రభుత్వ రికార్డులను తారుమారు చేసి భూములను ఆక్రమించారని వైసిపి నాయకులు మాట్లాడడం సరైన పద్ధతి కాదని, దమ్ముంటే మీరు ఈ విషయంపై బహిరంగ చర్చకు వస్తే ఆక్రమణదారులు ఎవరో బయట పెడతామని స్థానిక టిడిపి నాయకులు సవాల్ విసిరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి నాయకులు 3ధర్నాలు, 6ప్రెస్‌మీట్స్‌కు అలవాటు పడిపోయారని అన్నారు. ఆ కోణంలోనే పత్రికల్లో కనిపించేందుకు నిజాయితీపరులైన బీద సోదరులపై అసత్య ఆరోపణలు చేస్తున్నారన్నారు. మీరు పదే పదే విమర్శలు చేస్తున్నా మా నాయకులు బీద సోదరులు సూచనల మేరకు ఎప్పటికప్పుడు సంయమనం పాటిస్తున్నామని, ఇకపై ఊరుకోబోమని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. గతంలో ఈ భూములు ఆక్రమణల వ్యవహారం వచ్చినప్పుడు మీ నాయకులే మిమ్మల్ని మందలించిన సందర్భాలు గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. ఎందుకంటే అక్కడి భూములు మీ నాయకుల బినామీలే ఆక్రమించారని, వాటిపై విమర్శలు చేస్తే మీ నాయకులే బయటపడతారని. జిల్లాలో 20సం॥రాలుగా టిడిపి అధ్యక్షునిగా బీద రవిచంద్ర పార్టీ అభివృద్ధి కోసం కష్టపడి పనిచేసి తిరుగులేని నాయకునిగా ఎదిగారని, ఆయన కృషిని గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎమ్మెల్సీ పదవిని ఇచ్చారన్నారు. రాజకీయాలపై అవగాహన లేని మీరు ముందు స్థానిక పరిస్థితులను తెలుసుకుని మసలుకోవాలన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మెన్ నగళ్ళ శ్రీనివాసకిరణ్, పట్టణ ప్రధాన కార్యదర్శి అమరా వేదగిరి సుబ్బరాయుడు గుప్తా, జిల్లా కార్యదర్శి ఎ.బ్రహ్మయ్య, లీగల్ సెల్ పి.శ్రీనివాసులు, మైనారిటీ నాయకులు సర్ధార్ కీర్మాషీ, ఎస్సీ సెల్ నాయకులు జ్యోతి బాబూరావు, మాజీ పట్టణ ప్రధానకార్యదర్శి జి.వేణు, ఏఎంసి డైరెక్టర్ తిరువీధి ప్రసాద్, నాయకులు పి.శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# బ్రిడ్జిని పరిశీలించిన ఎమ్మెల్యే

కావలి పట్టణ పరిధిలోని అంబేద్కర్ నగర్ వద్ద పాపిరెడ్డి చెరువుకు నీళ్లు ప్రవహించే వరద కాలువపై నిర్మిస్తున్న వంతెనను కావలి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ బ్రిడ్జి నిర్మాణం పూర్తయితే మండలంలోని పలు గ్రామాలకు రాకపోకలు సులభంగా మారుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ బ్రిడ్జిని తొందరగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట వైసిపి జిల్లా ప్రధానకార్యదర్శి మన్నెమాల సుకుమార్‌రెడ్డి, వైసిపి నాయకులు కేతిరెడ్డి జగదీశ్వర్‌రెడ్డి, కుందుర్తి శ్రీనివాసులు, కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, ఎస్.శ్రీనివాసులు, ఆళ్ళ ప్రసాద్, వేమిరెడ్డి శరత్‌రెడ్డి, ఉప్పాల, మాచర్ల తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రిలో వసతుల కల్పనపై మండిపడ్డ ఎమ్మెల్యే

- విషజ్వరాలతో బాధపడుతున్న పేదలను చూసి చలించిపోయిన ప్రతాప్‌కుమార్‌రెడ్డి




విషజ్వరాలతో ఏరియా ఆసుపత్రి వార్డుల్లో సరైన వసతులు లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్న పేద ప్రజలను చూసి శాసనసభ్యులు రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి చలించిపోయారు. సోమవారం ఆయన స్థానిక ఏరియా వైద్యశాలను తనిఖీ చేశారు. ముందుగా డిసి సుబ్బారావు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లుతో కలిసి ఆసుపత్రి పరిసరాలను పరిశీలించి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలోని సదుపాయాలపై సూపరింటెండెంట్‌ను ప్రశ్నించగా ఆయన సరిగా సమాధానం ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే బహిరంగంగాననే ఆయన తీరును తప్పు పడుతూ మందలించారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటి అధ్యక్షుడినైన నాకు తెలియజేయకుండా ఇక్కడ పనులు ఎలా చేస్తారని అధికారులను నిలదీశారు. పేదల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సూపరింటెండెంట్‌ను వెంటనే తొలగించి ఆ స్థానంలో సరైన అధికారిని నియమించాలని డిసి సుబ్బారావుకు సూచించారు. అలాగే ప్రబలుతున్న విషజ్వరాల నుండి ప్రజలను కాపాడేందుకు 'ప్లేట్‌లెట్స్' నిల్వ వుంచే యంత్రాన్ని కొనుగోలు చేయాలని అన్నారు. ఆసుపత్రి షాపింగ్ కాంప్లెక్స్‌లోని రూముల బాడుగలను పునఃపరిశీలించి దళారులను తొలగించి నిజంగా ఎవరికి అవసరమో వారికే కేటాయించాలన్నారు.

**వైద్యులను తొలగించడమే గాని నియమించడం తెలియని మంత్రి:**

కావలి ఏరియా ఆసుపత్రిలో వైద్య సేవలందిస్తున్న ముగ్గురు వైద్యులను విచారణ లేకుండా తొలగించిన మంత్రి కామినేని శ్రీనివాసరావు తిరిగి ఆ స్థానాలను భర్తీ చేయవలసిన అవసరం లేదా అని ఎమ్మెల్యే నిలదీశారు. వెంటనే ఖాళీగా వున్న స్థానాలలో వైద్యులను నియమించి ప్రజలను కాపాడాలని కోరారు.

ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.సుకుమార్‌రెడ్డి, కె.నారాయణ పి.కామరాజు, వెంకటేశ్వరరెడ్డి, రాము, రాజశేఖర్, మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

# పని చేసే కార్మికులపైనే అధిక ఒత్తిడి



కావలి పురపాలక సంఘంలో పనిచేసే కార్మికులపైనే అధిక ఒత్తిడి వేసి పనిభారం పెంచుతున్నారని ఏఐటియుసి జిల్లా కార్యదర్శి దామా అంకయ్య పేర్కొన్నారు. పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురపాలక సంఘంలో 165 మంది ఒప్పంద, 40మంది శాశ్వత, 42మంది ఇటీవల నియమించిన ఒప్పంద కార్మికులున్నారు. మొత్తం 247మంది కార్మికులుండగా వీరిలో 100మంది మాత్రమే క్రమం తప్పకుండా పని చేస్తున్నారన్నారు. అయితే కమిషనర్ వీరితోనే రాత్రి 8గంటల వరకు పనులు చేయించటంలో ఆంతర్యమేమిటని అన్నారు. మిగిలిన కార్మికులు ఎక్కడ పని చేస్తున్నారో తెలియజేయాలన్నారు. ఇటీవల నియమించిన వారిని ఎందుకు ఉపయోగిస్తున్నారో కూడా తెలపాలన్నారు. పురపాలకంలో ఉన్న మొత్తం కార్మికులచే కమిషనర్ సమానంగా పని చేయిస్తే కావలి పట్టణం పరిశుభ్రంగా మారుతుందని సూచించారు. ఈ సమావేశంలో సిపిఐ కావలి డివిజన్ కార్యదర్శి దేగా సత్యం, ఏఐటియుసి కావలి కార్యదర్శి వెంకటేశ్వర్లు, రూరల్ కార్యదర్శి బాలకోటయ్య, కార్మికుల సంఘం నాయకులు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# భక్త సాగరంలా... నగరం

## మత సామరస్యానికి ప్రతీక రొట్టెల పండుగ






కులమతాలకు అతీతంగా ప్రతియేటా నెల్లూరు దర్గామిట్టలోని బారాషాహీద్ దర్గా వద్ద జరిగే రొట్టెలపండుగ మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తోంది. జిల్లా, రాష్ట్ర, దేశ విదేశాల నుంచి లక్షలాదిమంది భక్తులు ఈ పండుగలో పాల్గొన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి 28వ తేదీ వరకు 5రోజుల పాటు దాదాపు 7లక్షల మందికి పైగా భక్తులు ఈ పండుగలో పాల్గొన్నట్లు సమాచారం. మొహరం పండుగకు మూడవరోజు మాత్రమే జరుపుకునే ఈ పండుగను భక్తుల రద్దీ ఎక్కువ కావడంతో 5రోజులకు పెంచారు. ఇంతటి ప్రతిష్టాత్మకమైన పండుగను ప్రభుత్వం గుర్తించి రాష్ట్ర పండుగగా ప్రకటించింది. అయిదు రోజులు భక్తజన సందోహంతో దర్గా ప్రాంగణం కిటకిటలాడింది. ముస్లింలే కాకుండా హిందూ, క్రైస్తవ సర్వమతాల వారు భక్తి పారవశ్యంతో దర్గా ఆవరణంలో బారులు తీరారు. రోడ్లన్నీ వాహనాలతో కిటకిటలాడాయి. వివాహం కావాలని యువతులు పెళ్లి రొట్టె, ఉద్యోగం రావాలని యువత ఉద్యోగ రొట్టె, ఉన్నత విద్యను అభ్యసించాలని విద్యార్థులు, సంతానం కలగాలని దంపతులు, అనారోగ్య సమస్యలు తీరాలని రోగగ్రస్తులు... ఇలా తమ కోర్కెల కోసం రొట్టెలు పంచుకున్నారు. పరస్పరం మార్పిడి చేసుకున్నారు.

షహదత్‌తో పండుగ ప్రారంభమైంది. 26వ తేదీ తెల్లవారుజామున గంధ మహోత్సవం వైభవంగా జరిగింది. కడప దర్గా పీఠాధిపతి ఆరిఫ్ ఉల్లా హుస్సేని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. గంధమహోత్సవంలో పాల్గొని సమాధులకు లేపనం చేశారు. అనంతరం భక్తులకు గంధం పంపిణీ చేసారు.

రాష్ట్ర మంత్రి నారాయణ రాజధాని రొట్టెను నగర మేయర్ అబ్దుల్ అజీజ్ నుంచి స్వీకరించారు. ఎమ్మెల్సీ సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి దర్గాను సందర్శించి ప్రార్థనలు నిర్వహించారు. నెల్లూరురూరల్, నగర ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్‌లు ప్రత్యేకహోదా రొట్టెలను పట్టుకున్నారు. 27వ తేదీ తహలీల్ పాతెహాను ఘనంగా నిర్వహించారు. ఆరోజు జిల్లా కలెక్టర్ దర్గాను సందర్శించి ప్రార్థనలు నిర్వహించారు. ఆమెతో పాటు నగర మేయర్ అబ్దుల్ అజీజ్, దర్గా కమిటి అధ్యక్షుడు ఆసిఫ్‌బాషా పాల్గొన్నారు. మాజీఎమ్మెల్యే ఆనం వివేకానందరెడ్డి పాల్గొని డెంగ్యూ జ్వరాల నుంచి ప్రజలను కాపాడాలని రొట్టె పట్టుకున్నారు.

అయిదురోజుల పాటు జరిగిన రొట్టెల పండుగలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ డా॥ గజరావు భూపాల్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తును నిర్వహించారు. శనివారం నుంచి ప్రారంభమైన రొట్టెల పండుగ మంగళవారం తహలీల్ ఫాతేహాతో ముగిసింది. అయితే భక్తుల రద్దీ దృష్ట్యా వేడుకను బుధవారం అధికారులు ప్రకటించారు. తొలుత గంధం, ఖర్జూరాన్ని తీసుకొచ్చి మత పెద్దలు ఫాతేహా చేశారు. ముజావర్లు, ఫకీర్ల ప్రార్థనల మధ్య గంధాన్ని బారాషాహీదుల సమాధులపై లేపనం చేసారు. అనంతరం భక్తులకు గంధాన్ని పంచిపెట్టారు. బుధవారం సాయంత్రం వరకు పండుగ జరుగనుండడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు తరలివచ్చి తమ కోర్కెల రొట్టెలను స్వర్ణాల చెరువులో పట్టుకున్నారు. రొట్టెల పండుగ కోసం దర్గా ఆవరణలో వ్యాపారులు పెద్దఎత్తున దుకాణాలు ఏర్పాటు చేశారు. చిన్నారుల కోసం జెయింట్‌వీల్, ఆట వస్తువులను ఏర్పాటు చేశారు. విద్యుత్‌దీప కాంతులతో దర్గా ఆవరణం కళకళలాడింది.

# నెల్లూరు మెడికల్ కాలేజీలో ఎంసిఐ టీమ్

నెల్లూరులోని ఏసి సుబ్బారెడ్డి ప్రభుత్వ వైద్యకళాశాలను భారత వైద్యమండలి బృందం సభ్యులు ప్రదీప్‌గార్గే, సచ్చిదానంద మహంతి, టిఇ నటేకర్‌లు బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలేజీలో మూడో సంవత్సరం అడ్మిషన్లు అనుమతినిచ్చేందుకు ఈ తనిఖీ చేపట్టారు. లేబొరేటరీలను, తరగతి గదులను పరిశీలించారు. తగినంత బోధనా సిబ్బంది ఉన్నారా లేరా అని ఆరా తీసారు. విద్యా విధానంపై విద్యార్థులను విచారించారు. పెద్దాసుపత్రిలో వసతులు, వైద్యసేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు.

# మహిళల్లోనే ఎక్కువగా పక్షవాతం



పక్షవాతం సమస్య మహిళల్లోనే ఎక్కువగా వుంటుందని, పురుషుల్లో కంటే స్త్రీలలో ఈ సమస్య ఎక్కువుగా వుందని, ఆ కారణంగా వారిలో మరణాల సంఖ్య కూడా ఎక్కువుగా వుందని అపోలో హాస్పిటల్స్ న్యూరాలజిస్ట్ డా॥ బిందుమీనన్ అన్నారు. ప్రపంచ పక్షవాత దినోత్సవం సందర్భంగా ఈనెల 29న నెల్లూరు ఏసి సుబ్బారెడ్డి స్టేడియంలో పక్షవాతంకు సంబంధించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ మహిళలు పక్షవాతం సమస్యను తీవ్రంగా పరిగణించక చికిత్స పొందడంలో శ్రద్ధ చూపడం లేదన్నారు. రక్తపోటు, గుండె కొట్టుకోవడంలో తేడాను, మధుమేహ వ్యాధి, ఊబకాయంను గురించి పట్టించుకోకపోవడం వల్ల మహిళల్లో పక్షవాతం సమస్య ఎక్కువుగా ఉందన్నారు. సరైన చికిత్స తీసుకొనేందుకు నాలుగున్నర గంటలు సమయం చాలన్నారు. లింగ బేధంతో సంబంధం లేకుండా ప్రతి ఆరు సెకండ్లలో ఎక్కడో ఒక చోట ఎవరో ఒకరు మెదడు పక్షవాతంతో మరణిస్తున్నారన్నారు. మెదడులో ఒక భాగానికి సరిగా రక్తప్రసరణ జరగకపోవడం వల్ల పక్షవాతం వస్తుందని, వెంటనే దీనికి చికిత్స పొందడం అవసరమన్నారు.

# ఆపరేషన్ అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

నమ్మక తప్పదనే అంటున్నాయి తెలుగు దేశం వర్గాలు. శక్తివంతమైన మీడియా ఛానళ్లు, వార్తా పత్రికలు, సిమెంట్ ఫ్యాక్టరీలు, పవర్ ప్రాజెక్టులు వేల కోట్లు చేసే వ్యాపార సముదాయాలూ... ఇవన్నీ ఆ లక్ష కోట్లలో భాగమే అన్నది వారి వాదన. వై.యస్. హయాంలో జరిగిన భూ పందేరం ద్వారానే ఇవన్నీ సాధ్యం కాగలిగాయన్నది వారి ఆలోచన. అందుకే ఇప్పుడు తమ అధినాయకుడు చంద్రబాబు ఆధ్వర్యంలో లోకేష్‌బాబు సారధ్యంలో వారి నమ్మిన బంటు నారాయణ నేతృత్వంలో అతిపెద్ద రియల్ ఎస్టేట్ కంపెనీకి తెర లేపారు. ఆ కంపెనీ పేరు 'రాజధాని' అయితే లే అవుట్ పేరు 'అమరావతి'. ఇక్కడ లక్షల యకరాలు ప్రభుత్వం రైతుల నుండి లాగేసుకుంటుంది. ఇవన్నీ అంతర్జాతీయ కంపెనీలకు అప్పజెప్పి తద్వారా అధికారికంగా వేలకోట్లు, అనధికారికంగా లక్షల కోట్లు రాబట్టబోతోంది. తొమ్మిదేళ్ళ పాలనలో కేవలం రెండు వేల కోట్లు సంపాదించుకున్నారన్న మాటను ప్రజలు మర్చిపోయేలా ఐదేళ్ల పాలనలో 5లక్షల కోట్లు సంపాదనే ధ్యేయంగా పావులు కదుపుతోంది. రాష్ట్ర ప్రభుత్వాన్ని తమ స్వంత ఇంటి సంస్థలాగా రాబోయే రాజధాని తమ కొత్త వెంచర్‌లాగా ప్రచారం చేసుకుంటూ పెట్టుబడులకు తలుపులు తెరిచామని ఓ వైపు చెప్తూనే మరోవైపు రాబడి కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్నారు.

తాము చేయబోయే బహిరంగ దోపిడీకి ప్రచారకర్తగా సాక్షాత్తూ ప్రధాన మంత్రినే వాడుకున్నారు. విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో తమ సామాజిక వర్గాల వారికి ఎక్కువ లాభం చేకూర్చబోతున్నాం అంటూ తెరవెనుక ప్రచారం చేసుకుంటూ సింగపూర్, జపాన్, జర్మన్ వంటి దేశాల ప్రతినిధులతో తమ స్వంత లావాదేవీలు ఒప్పందాలను చేసేసుకుంటున్నారు.

రాష్ట్ర చరిత్రలో అప్పటి వరకూ కనీవినీ ఎరుగని స్థాయిలో సుపరిపాలన అందించి ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేరువైన వై.యస్.రాజశేఖరరెడ్డి వంటి వ్యక్తినే రెండవసారి అతి తక్కువ మెజారిటీతో గెలిపించిన మనస్తత్వం ప్రజలదన్నది తెలుగుదేశం పాలకుల మైండ్‌కి బాగా ఎక్కిందని, ఈ ప్రజలకు ఎంత చేసినా దండగే కాబట్టి దీపం వుండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలన్నట్లుగా మరో వంద తరాలు తిన్నా తరగదన్నట్లుగా సంపాదనే ధ్యేయంగా తమ పార్టీ పెద్దలు ముందుకు వెళ్తున్నారని తెలుగుదేశం పార్టీలోనే కొందరు కామెంట్ చేసుకుంటున్నారంటే, ఈసారి ఈ పార్టీ టార్గెట్ ఏమిటో మనకి అర్థమైపోతుంది.

ఆపరేషన్ అమరావతి పేరుతో తమ ఖజానా నింపుకునే ప్రయత్నమే "రాజధాని". లక్షల కోట్ల రాబడిని రాజమార్గాన పొందడానికి రూపొందించిన పథకమే "రాజధాని". ఇది ప్రజా రాజధాని కానే కాదు, ఖచ్చితంగా పాలకుల రాజధానే. ప్రజాస్వామ్యమా వర్ధిల్లు, ధనస్వామ్యమా విరాజిల్లు.

# ఇప్పటికైనా మేల్కొన్నారు!

(మొదటి పేజీ తరువాయి)

కోస్తా, రాయలసీమ జిల్లాలు లేకుంటే హైదరాబాద్ ఈరోజు ఈ స్థాయిలో ఉండేది కాదు. ఇది అందరూ ఒప్పుకోవాల్సిన నిజం. చారిత్రాత్మక హైదరాబాద్‌ను తీసి పక్కన పెడితే అధునాతన హైదరాబాద్ కోస్తా, రాయలసీమ వాళ్ల పుణ్యమే. అసలు సినిమా ఇండస్ట్రీ, సాఫ్ట్‌వేర్ లేకపోయి వుంటే హైదరాబాద్ గతేంటి? ఈ రెండూ హైదరాబాద్ రావడానికి ప్రధాన కారణం సీమాంధ్ర పాలకులే!

ఈరోజుకు కూడా రాజధాని పరిపాలనా పరంగా ఆంధ్రప్రదేశ్ నుండి ఆదాయం అంతో ఇంతో తెలంగాణకు పోతూనే వుంది. దీనికి కారణం మన అసెంబ్లీ, మన సచివాలయం, మన పరిపాలనా వ్యవస్థలు, మన హైకోర్టు... అన్నీ అక్కడే వున్నాయి. మన రాష్ట్రానికి చెందిన పారిశ్రామికవేత్తల పరిశ్రమలూ అక్కడే వున్నాయి. వీటి మూలంగా జరిగే వ్యాపారం, పన్నుల వసూళ్లు అన్నీ తెలంగాణ ఖాతాలోనే జమవుతున్నాయి.

కేసీఆర్ చాలా తెలివైనోడు. ముఖ్యమంత్రి కాగానే తమ ప్రభుత్వం డబ్బు ఖర్చు పెట్టాల్సి వుంటుందని చెప్పి ఆంధ్రా ఉద్యోగులను మాత్రం వెళ్లగొట్టాడు. ఇక వాళ్లకు జీతాలిచ్చే పని వుండదు కదా! నూటికి 95శాతం మంది ఆంధ్రావాళ్లు వున్న సినిమా పరిశ్రమను మాత్రం అక్కున చేర్చుకుని ప్రోత్సాహకాలు ప్రకటించాడు. సినిమా పరిశ్రమ వుంటే హైదరాబాద్‌కు ఆదాయం. అలాగే హైకోర్టు విభజన విషయంలోనూ ఆయన తొందర పడలేదు. ఎందుకంటే కోర్టు కేసుల మీద రోజూ వందలమంది సీమాంధ్ర నుండి హైదరాబాద్ వెళుతుంటారు. వీరివల్ల అక్కడ వ్యాపారులకు ఆదాయం. అలాగే పరిపాలనా, అధికార వ్యవస్థలను తరలించాలని కూడా అతను తొందరపెట్టలేదు. సీమాంధ్ర రాజకీయ నాయకులు లేకుంటే హైదరాబాద్‌లో రాజకీయ సందడే వుండదు. కాబట్టే కేసీఆర్ ఈ వ్యవస్థలను హైదరాబాద్ నుండి వెళ్లగొట్టాలనుకోలేదు.

మొన్నటి దాకా చంద్రబాబు కూడా హైదరాబాద్ మైకంలో పడిపోయాడు. రెండు కళ్లు, రెండు కాళ్లు సిద్ధాంతంపై రెండు పడవల ప్రయాణం చేయసాగాడు. దీనివల్ల సీమాంధ్రలో అనుకున్నంత ఊపు రాలేదు. ఓటు–నోటు కేసు తర్వాత ఆయనలోనూ పరివర్తన వచ్చింది. ఎంత ప్రేమ పెంచుకున్నా హైదరాబాద్ మనది కాదని అర్థం చేసుకున్నట్లున్నాడు. అందుకే 2016 జూన్ కల్లా ఏపి రాజధానిని విజయవాడకు తరలించేలా జి.ఓ జారీ చేశాడు. ఇది ఒకరకంగా మంచిపనే! ఉద్యోగులు అంతా మన రాష్ట్రంలోనే వుంటారు. పరిపాలనా వ్యవహారాలు ఇక్కడే జరుగుతుంటాయి. ఇంకా హైదరాబాద్‌కు మన ఆదాయం దోచిపెట్టే ప్రక్రియ పోతుంది. క్రమక్రమంగా హైదరాబాద్‌లో వున్న మన పరిశ్రమలు, సినీ ఇండస్ట్రీ, హైకోర్టు వంటి వాటిని కూడా మన రాష్ట్రానికి తరలిస్తే ఏపి లేని లోటేంటో తెలంగాణ వారికి తెలిసొస్తుంది.

# ప్రథమ వర్ధంతి



అందరి హృదయాలలో సుస్థిర స్థానమేర్పరచుకుని,
నిండునూరేళ్ళు పరిపూర్ణ జీవితాన్ని సాగించిన ప్రేమానురాగాలదీప్తి,
మా అభివృద్ధికి కారకురాలు, దైవసమానులు

## కీ॥ శే॥ శ్రీమతి గునుపాటి రుక్మిణమ్మ గారు

పరమపదించి తేది 30-10-2015 నాటికి
యేడాది గడిచిన సందర్భంగా వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని
ఆ భగవంతుని ప్రార్థిస్తూ... శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము

**కుమారులు - కోడళ్ళు**

గునుపాటి వెంకటకృష్ణారెడ్డి - ఇందిరమ్మ
గునుపాటి జనార్ధన్‌రెడ్డి - సునీతమ్మ
గునుపాటి రామ్‌మోహన్ రెడ్డి - శుభప్రదమ్మ

**కుమార్తెలు - అల్లుళ్ళు**

కోటిరెడ్డి నిర్మలమ్మ - కీ॥శే॥ కోటిరెడ్డి రామచంద్రారెడ్డి
అత్తివరపు విమలమ్మ - అత్తివరపు రామచంద్రారెడ్డి
దొడ్ల లలితమ్మ - దొడ్ల పద్మనాభ రెడ్డి

**మరియు మనుమలు, మనుమరాళ్ళు, ముదిమనుమలు, ముదిమనుమరాళ్ళు**

Edited, Published, Printed & Owned by **THUNGA SIVAPRABHATH REDDY**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Printed & Published at **Roopa Graphics**, Plot no:1&2, Main Road, Magunta Layout, NELLORE-524003. Ph:2323485. Editor-**THUNGA SIVAPRABHATH REDDY,** Executive Editor-**G.SREENIVASULU REDDY**. e-mail: roopagroup@yahoo.com